మహాపాత్ర... (మహాసమరం)

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 73 పేజీలు: 8+16 వెల: 6.50

డీలిమిటేషనే అసలు సమస్య: సోనియాగాంధీ 5

పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం!

# హార్ముజ్ నౌకల దిగ్బంధం

**158 ఇరాన్ నౌకలను ముంచేశాం**

**వచ్చేపోయే అన్ని నౌకలను అడ్డుకుంటున్నాం: ట్రంప్**

**మరింత పెరిగిన ఉద్రిక్తతలు**

**అమెరికా చర్యలను దీటుగా ఎదుర్కొంటున్నాం: ఇరాన్**

**సముద్ర దొంగలా మారిన అమెరికాను వదలం: సయ్యద్ మాజిద్**



**టెహ్రాన్ /వాషింగ్టన్, ఏప్రిల్ 13:** పాకిస్తాన్‌లో చర్చలు విఫలమైన వెనువెంటనే ట్రంప్ తన యుద్ధ కార్యాచరణ మళ్లీ షురూచేసారు. హార్ముజ్‌ను ముట్టడించాలని అమెరికా నౌకదళాలను ఆదేశించారు. జలసంధిలోకి వచ్చే నౌకలు కానీ, జలసంధినుంచి వెళ్లే నౌకలు అన్నింటినీ అడ్డుకుంటామని ట్రూత్‌సోషల్‌మీడియా పోస్టులో హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌కు చెందిన 158 నౌకలు ముంచివేసామని, అవి సముద్రజలాల్లో అట్టడుగున ఉన్నాయని గుర్తుచేసిన ట్రంప్ ఫాస్ట్ అటాక్ షిప్స్ అనేవి తమ టార్గెట్‌కాదని, అవి కేవలం స్వల్పసంఖ్యలోనే ఉన్నాయని పేర్కొన్నారు. నేవల్‌బ్లాకేడ్ పరిధిలోకిఈ నౌకలు వస్తే వాటినిసైతం ధ్వంసంచేయడం లేదా ముంచివేయడంజరుగుతుందని పేరొనకన్నారు. డ్రగ్ డీలర్లపై ఎలాంటి కఠిన కార్యాచరణ తీసుకున్నామో ఇపుడు ఇరాన్ నౌకలపైనా అదే చర్యలు తీసుకుంటామని అన్నారు. సముద్రమార్గాల మీదుగా అమెరికాకు డ్రగ్‌రవాణాను పూర్తిగా నిర్మూలించామని ఇపుడు హార్ముజ్‌లో ఇరాన్‌నౌకలపైనా అదే వైఖరి ఉంటుందన్నారు. ఇపుడు 98.2శాతం సముద్రమార్గంలో డ్రగ్స్ రవాణా ఆగిపోయిందని, ఇపుడు చమురుపరంగా ఇరాన్‌పైనా అదే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి నేవల్‌బ్లాకేడ్‌ప్రారంభించారు. ఇరాన్‌లోని పోర్టుల్లోకి వచ్చేనౌకలు కానీ, ఇరాన్‌నుంచి వెళ్లేనౌకలను కాని అన్నింటినీ అడ్డుకుంటామన్నారు. అన్నిదేశాల నౌకలపైనా ఈ ఆంక్షలు అమలుచేస్తామని అరేబిన్ గల్ఫ్‌లోని అన్ని ఇరాన్

>>2

# 21వ శతాబ్దం నారీశక్తిదే

**అత్యంత కీలక సంస్కరణలు తీసుకొస్తున్నాం: ప్రధాని మోడీ**



న్యూఢిల్లీలో 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారతదేశపు 'నారీ శక్తి' తమ కఠోర శ్రమ, ధైర్యం, ఆత్మవిశ్వాసం ద్వారా సరికొత్త శిఖరాలను అధిరోహించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మహిళలకు మరిన్ని అవకాశాలను కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపించేందుకు అందరూ ఏకంకావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రసంగిస్తూ, భారతదేశం 21వ శతాబ్దపు అత్యంత భారీ నిర్ణయాలలో ఒకదానిని తీసుకోబోతోందని, ఈ నిర్ణయం పూర్తిగా మహిళా సాధికారతకే అంకితమని మోడీ తెలిపారు. పార్లమెంటు ఒక సరికొత్త చరిత్రను సృష్టించే అంచున ఉందని, గత, భవిష్యత్ తరాల ఆకాంక్షలను నెరవేర్చే చరిత్ర అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు, దశాబ్దాలుగా కొనసాగుతున్న సుదీర్ఘ నిరీక్షణ ఈ నెల 16, 17, 18 తేదీలలో ముగియనుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. 2023లో, నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనంలో, ఈ చట్టం సకాలంలో అమలు అయ్యేలా చూసేందుకు ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' రూపంలో తొలి అడుగు వేసిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి మోడీ పునరుద్ఘాటించారు. "మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుండి రాజ్యాంగ సభ నిర్ణయాల వరకు, స్వతంత్ర భారతదేశపు పునాదులను నిర్మించడంలో భారతీయ

>>2

# హైబ్రిడ్ మోడల్ మేలు

**డీలిమిటేషన్‌కు సిఎం రేవంత్ సూచన**

**మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంలో రాజకీయ కుట్ర**

**ప్రస్తుత పార్లమెంట్ సీట్ల ఆధారంగానే మహిళా బిల్లును అమలు చేయాలి**

**డీలిమిటేషన్‌పై సిఎంలకు లేఖలు రాస్తా**

**మంత్రులతో కలిసి మీడియాతో సిఎం**



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి, సలహాదారు కెకె తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్13:** డీలిమిటేషన్ వ్యవహారం ప్రస్తుతం దేశమంతా హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయంపై తెలంగాణ మ్యుమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపైన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి కేంద్రం హడావుడి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటిని ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తోందని. ఈరెండు అంశాలు ఒకదానికి ఒకటి సంబంధం లేనివని ఆయన పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డీలిమిటేషన్ అంశంపై సచివాలయంలో మంత్రులు, ఎంపీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి దేశ ప్రజలందరికీ సంబంధించిన అంశాలని రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ, బీజేపీ మాత్రం తమసొంత వ్యవహారం అన్నట్లుగా వ్యవహారిస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను కలిపి తీసుకురావడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రెండింటిని విడదీసి వేరు వేరుగా చర్చించి అమలుపైన విధివిధానాలు

>>2

బిజెపికి మహిళాధ్యక్షురాలు ఎందుకు లేరు? 7

కాంగ్రెస్‌లో మహిళా నాయకత్వంలో పనిచేశాం, ప్రధాని, రాష్ట్రపతులను చేశాం

కిషన్, బండి సంజయ్ విమర్శలకు సిఎం కౌంటర్



దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

# రేపటి నుంచి 'దోస్త్' రిజిస్ట్రేషన్లు

**మూడు విడతలుగా డిగ్రీ అడ్మిషన్లు**

**జులై 1 నుంచి క్లాసులు ప్రారంభం**

**869 కాలేజీలు 4.40 లక్షల సీట్లు**

**ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 13:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 నోటిఫికేషన్‌ను జారీ చేశారు. రిజిస్ట్రేషన్లను రేపటి (బుధవారం) నుంచి ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. మొత్తం మూడు దశల్లో డిగ్రీ అడ్మిషన్లను చేపట్టనున్నట్టు చెప్పారు. జులై 1 నుంచి క్లాసులను ప్రారంభించేలా షెడ్యూల్‌ను రూపొందించినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆయన సోమవారం

>>2

# భూ హక్కులకు పూర్తి భద్రత

**భూ భారతి చట్టం అమలులోకి వచ్చి యేడాది**

**3.80 లక్షల మందికి పాస్‌బుక్‌లు జారీ**

**ప్రతి సర్వే నంబర్‌కు భూధార్: మంత్రి పొంగులేటి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్13:** భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాంది పలికిన రోజని పేర్కొన్నారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈచట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. "నాటి పరిస్థితిని పూర్తిగామార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం. ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం. మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. జిల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నాం. సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తాం. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా సర్వే నిర్వహించాలని నిర్ణయించాం. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ 77 సంవత్సరాలలో 2కోట్ల 29 లక్షలకు చేరాయి. వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నామని చెప్పారు.

7 మాజీ సిఎం కెసిఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు



సోమవారం భద్రాచలంలో జరిగిన సభలో ప్రంసగిస్తున్న ఎంపి రేణుక

# ఆ ఐదూళ్లకోసం మళ్లీ ఉద్యమిస్తాం

**వాటిని తిరిగి తేవడానికి కేంద్రం మెడలు వంచుతాం: రేణుకా చౌదరి**

**భద్రాచలం, ప్రభాతవార్త:** నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఐదు గ్రామ పంచాయతీల కోసం పోరాటం ఆగదు!" అంటూ రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి గట్టిగా హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సోమవారం భద్రాద్రి పునరేకీకరణపై నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం రాజకీయ వేడి రాజేసింది. రాష్ట్ర విభజన

>>2



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆర్టీసీ నాయకులు

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

**22న మొదటి డ్యూటీ నుంచి కార్మికుల సమ్మె**

**లేబర్ కమిషనర్‌తో చర్చలు విఫలం**

**ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్**

**యూనియన్లకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 13:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో మరోసారి సమ్మె సైరన్ మోగింది. ఈనెల 22 మొదటి డ్యూటీ నుంచి కార్మికులు సమ్మె చేయాలని నిర్ణయించారు. ఆర్‌టిసి కార్మిక సంఘాలతో సోమవారం లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్టు ఆర్‌టీజీ జేఏసీ నేతలు తెలిపారు. గత నెల 13న ఆర్‌టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇవ్వగా కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ దగ్గర రెండుసార్లు చర్చలు జరిగాయి. గతంలో జరిగిన చర్చల సమయంలో ఆర్‌టీసీ యాజమాన్యం నుంచి ప్రతినిధులు హాజరు కాకపోవడంతో సోమవారం మరోసారి చర్చలుజరపాలని లేబర్ కమిషనర్ నిర్ణయించారు. సోమవారం సాయంత్రం చర్చల సందర్భంగా జేఏసీతో చర్చల సందర్భంగా కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించకపోవడంతో తాము సమ్మెలోకి వెళుతున్నట్టు జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ

>>2

# మామిడిపండు మెరుపు ఆరోగ్యానికి చెరుపు!

**కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు**

**ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతి**

**కల్తీ పండ్లతో క్యాష్ చేసుకొంటున్న వ్యాపారులు**



**నిగనిగలాడే పసుపు రంగు పళ్లవెనుక హానికారకాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** వేసవి వచ్చిందంటే చాలు మామిడి పండ్లతో మార్కెట్లు కళకళలాడిపోతాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని పండ్ల మార్కెట్లు కూడా మామిడిపండ్లతో నిండిపోయాయి. అయితే చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టంగా తినే మామిడి పండ్ల డిమాండ్‌ను అక్రమార్కులు క్యాష్ చేసుకుంటున్నారు. ఇదే అదునుగా కల్తీ పండ్లను మార్కెట్‌లోకి దించుతున్నారు. పైకి చూస్తే నిగనిగలాడే పసుపురంగులో చూడగానే నోరూరించేలా కనిపిస్తున్న ఆ మామిడి



పండ్ల వెనుక పెను ప్రమాదం పొంచి ఉంది. పైన పండులా కనిపిస్తున్నా, లోపల మాత్రం అవి పచ్చికాయలే. కేవలం రసాయనాల మాయాజాలంతో మామిడి కాయలను విషపూరితం చేస్తున్న అక్రమార్కులకు అడ్డుకట్ట పడడం లేదు. మామిడి కాయలు సహజంగా పండటానికి సమయం పడుతుంది. అయితే అధికలాభాలకోసం వ్యాపారులు అడ్డదారి తొక్కారు. ఆరోగ్యానికి అత్యంతప్రమాదకరమైన ఎథిలిన్ సాచెట్లను మామిడి కాయల మధ్యలో ఉంచి, వాటిని

>>2




సోమవారం మీర్జాపూర్‌లో భోస్లేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

## రేపటి నుంచి 'దోస్త్' రిజిస్ట్రేషన్లు

>> మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్లు పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ అధికారి బాల భాస్కర్‌తోపాటు దోస్త్ కోఆర్డినేటర్స్ విజయారెడ్డి, వసుంధర పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దోస్త్ నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నెల 15(రేపటి) నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. మూడు విడతల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొన్ని కోర్సులను ప్రవేశ పెడుతున్నామన్నారు. కొత్త కోర్సుల వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ నెల 30 నుంచి వెబ్ ఆప్షన్లు ఉన్న నేపథ్యంలో ఆ లోపుగా యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపును పూర్తి చేసేలా చూడాలని సూచించామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కూడా కొత్త కోర్సుల ప్రవేశాలపై 30లోపుగా నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 969 కాలేజీల్లో 4,40,107 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాన్ దోస్త్ కాలేజీలు 60 ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా అడ్మిషన్లు జరగని కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వకుండా ఉండే నిబంధనలను అమలు చేసేలా చూడాలని యూనివర్సిటీలకు సూచిస్తామన్నారు. రాష్ట్రంలో గత ఏడాది జీరో అడ్మిషన్ పొందిన కాలేజీలు 54 ఉండగా.. వాటిలో ఒకటి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. ఫేజ్-1 రిజిస్ట్రేషన్లను ఈ నెల 15 నుంచి మే 7వరకు కొనసాగించనున్నారు.

అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 14న తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం మే 15 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15 నుంచి మే 25 వరకు కొనసాగనుంది. మే 15 నుంచి మే 26 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. మే 30న సెకండ్ ఫేజ్ సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌ను మే 31 నుంచి జూన్ 5 వరకు చేయాల్సి ఉంటుంది. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31 నుంచి జూన్ 15 వరకు జరగనుంది. మే 31 నుంచి జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 20న మూడో విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి జూన్ 20 నుంచి జూన్ 25 వరకు ఉంటుంది.

అన్ని విడతల్లోనూ సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27 మధ్యలో హాజరై అడ్మిషన్ తీసుకోవల్సి ఉంటుంది. జూన్ 29, 30 తేదీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. రెండో విడత నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 400 చెల్లించాల్సి ఉంటుంది.

## మళ్లీ ఉద్యమిస్తాం

>> సమయంలో జరిగిన అన్యాయాలపై మండిపడ్డ ఆమె.. "భద్రాచలం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోయేదే.. కానీ ప్రజల పోరాటంతో తెలంగాణలో మిగిలింది" అంటూ పాత గాయాలను గుర్తు చేశారు. ఐదు గ్రామాల సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించడం "రాముడి వరం" అని చెప్పిన ఆమె.. అవసరమైతే కేంద్రాన్ని సైతం ఒత్తిడికి గురిచేస్తానని సవాల్ విసిరారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్థానిక వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ అగ్నికన్నాయిగూడెం, యటపాక, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్నా.. మనసు మాత్రం భద్రాచలంతోనే ఉందని వారు స్పష్టం చేశారు. భద్రాచలంలో చెత్త నిర్వహణ సమస్య తీవ్రరూపం దాల్చింది. గోదావరి ఒడ్డున పదేళ్లుగా చెత్త వేయడం వల్ల నది కాలుష్యం పెరుగుతుందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సీఎం సానుకూలంగా స్పందిస్తే సమస్య పరిష్కారం సాధ్యమేనని నేతలు భావిస్తున్నారు. త్వరలోనే సమిష్టిగా కలసి చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. మొత్తం మీద.. భద్రాచలం కేంద్రంగా మళ్లీ ఒక భారీ ఉద్యమానికి బాటలు పడుతున్నాయి. ఐదు గ్రామాల సమస్య రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ సమావేశంలో రాష్ట్ర టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టీఎన్జీవో కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు, భద్రాచలం టిఎన్జీవో అధ్యక్షులు డెక్క డెక్క నరసింహారావు, బాలకృష్ణ, భద్రాద్రి జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు చల్లగుంట్ల నాగేశ్వరరావు, భద్రాచలం డివిజన్ బీఆర్ ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, ఆక్కోజు సునీల్, నక్క వెంకన్న, అవులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెట్లాబుర్జు ప్రసూతి ఆసుపత్రి నుంచి మహిళా ఖైదీ అదృశ్యం

**హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** పాతబస్తీ పెట్లాబూర్జు ప్రభుత్వ ఆధునికి ప్రసూతి ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఓ మహిళా విచారణ ఖైదీ ఆసుపత్రి నుంచి పరారైన సంఘటన సోమవారం హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హుస్సేనీఆలం డిఐ దసుర్రు నాయక్ కథనం ప్రకారం... త్రివేణి (26) రామ్‌గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ చీటింగ్ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం చంచల్‌గూడ ప్రత్యేక మహిళా జైలులో విచారణ ఖైదీగా ఉంది. గర్భిణీ కావటంతో త్రివేణి వైద్య పరీక్షలు కోసం సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో పాతబస్తీలోని పెట్లాబూర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చింది. విచారణ ఖైదీ త్రివేణి వెంట పెట్లాబూర్జు సిఎఆర్ హెడ్ క్వార్టర్స్‌కు చెందిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఆసుపత్రిలో ఉన్న సమయంలో విచారణ ఖైదీ త్రివేణి వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పి వెళ్లింది. తిరిగి త్రివేణి రాలేదు. ఆసుపత్రి మొత్తం వెతికిన ఆమె జాడ కనిపించ లేదు. ఆసుపత్రి నుంచి విచారణ ఖైదీ త్రివేణి తప్పించుకుని పారిపోయింది. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావుకు సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్13:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నివాళ్లు అర్పించారు. తెలుగు రాష్ట్రాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ సంజయ్ పాల్గొన్నారు.

## నారీశక్తిదే

>> మహిళలు అపారమైన కృషి చేశారు" అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రపతి నుండి ప్రధానమంత్రి వరకు ఏ ఉన్నత పదవిలో మహిళలు బాధ్యతలు చేపట్టినా, వారు తమదైన ప్రత్యేక ముద్రను, వారసత్వాన్ని సృష్టించుకున్నారని మోడీ వివరించారు. వారు దేశ గౌరవాన్ని, కీర్తిని రెండింటినీ ఇనుమడింపజేశారని ఆయన పేర్కొన్నారు. మహిళా నాయకత్వానికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి అభివర్ణించారు. నేడు భారతదేశంలోని స్థానిక ప్రభుత్వ సంస్థలలో 14 లక్షల మందికి పైగా మహిళలు విజయవంతంగా సేవలందిస్తున్నారని మోడీ తెలిపారు. 2014 నుండి, ఎన్‌డియే ప్రభుత్వం మహిళల జీవితంలోని ప్రతి దశలోనూ వారికి అండగా నిలిచేలా అనేక పథకాలను ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు శాసనసభలు, లోక్‌సభలో అడుగుపెట్టాలనే తమ ఆకాంక్షలను గట్టిగా వినిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారి కలలకు కొత్త రెక్కలు వచ్చాయని, దేశంలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందని మోడీ అన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో మహిళలందరూ తమ క్రియాశీల భాగస్వామ్యాన్ని కొనసాగించాలని, తమ ఎంపీలను కలిసి తమ దృక్పథాలను, ఆశయాలను పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, వివిధ రంగాల నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

14-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
ద్వాదశి రా.12.08
శతభిష సా.4.00
వర్జ్యం : రా.10.12-రా.11.46
దు.ఉ.8.22-ఉ.9.12,
2) రా.11.22-రా.12.12
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి. బంధువుల కలయిక.

**వృషభం:** జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో నిదానం వహించండి. ఆస్తి వివాదాలు తీర లబ్ధిని పొందుతారు.

**కర్కాటకం:** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి చూపుతారు. ఖర్చులను అదుపుచేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. స్థలాలు, భూములు కొనుగోలు చేస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** జీవిత భాగస్వామి సలహాలు పదే పదే తీసుకుంటారు, వాటిని అనులుచేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది. శుభకార్యాలు పాల్గొంటారు.

**ధనుస్సు:** మీ మాటకు విలువ పెరుగుతుంది. విదేశాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఋణాలు తీరుతాయి.

**మకరం:** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సాంకేతిక లోపాలవలన అతి తక్కువ వ్యవధిలో అధిక లాభాలు కలిగే విషయ వ్యవహారాలకు భంగం కలుగదు.

**మీనం:** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. వస్త్రలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైబ్రిడ్ మోడల్ మేలు

>> రూపొందించాలని చెప్పారు. 'తక్షణమే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి.. ప్రస్తుతం ఉన్న లోక్ సభ, అసెంబ్లీ స్థానాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి అని సూచించారు. దక్షణాది రాష్ట్రాలు ఆర్థిక రాజధానులు.. ఉత్తరాధి రాష్ట్రాలు రాజకీయ రాజధానులు.. పన్నులు కట్టడం, సలామ్ చేయడానికి మేం వ్యతిరేకం.. సీట్ల పునర్విభజన పైన హైబ్రీడ్ మోడల్‌ను నేను ప్రపోజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పెంచాలనుకుంటున్న 272 సీట్లలో 136 సీట్లు ప్రొరేటా ప్రకారం.136 సీట్లు జీఎస్‌డీపీ ప్రకారం సీట్ల పునర్విభజన చేయాలి.. స్థూల ఉత్పత్తిలో అత్యధికంగా భాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి అని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభా ప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారు.. దేశానికి దక్షణ భారతదేశం దేశానికి ఆదాయాన్ని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.. మమ్మల్ని ఎలా శిక్షిస్తారు.. ? అని ప్రశ్నించారు. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో యాభై శాతం రిజర్వేషన్లు, యాభై శాతం మెరిట్ తో చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. అందుకే రిజర్వేషన్లు యాభై శాతానికి మించలేదు..సీట్ల పునర్విజభన పైన అఖిల పక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేయాలి.. పార్లమెంటులో పునర్విభజన పైన చర్చించాలి.. నిపుణలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.. అన్ని అసెంబ్లీల్లో చర్చకు పెట్టి పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి.. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు...హడావుడిగా చేసి దేశంలో దక్షణ, ఉత్తరాది మధ్య గ్యాప్ పెంచొద్దు అని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఇంత కాలం మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చింది.. 2026 తర్వాత జనాభా లెక్కల తర్వాత గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు...2024 లోక్ సభ ఎన్నికల్లో 543 లోక్ సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే 181 మహిళలు ఎన్నిక అయ్యేందుకు అవకాశం ఉండేది అని పేర్కొన్నారు. '2026 జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు..2026 జనాభా లెక్కల ప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చు అని పేర్కొన్నారు. 'మహిళా రిజర్వేషన్లు, పునర్విభజన్లను కలపడంలో రాజకీయ కుట్ర ఉంది..2026 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటాం. మహిళల రాజకీయ సాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వ్యభజన ను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. 'గతంలో నియోజకవర్గాల పునర్విభజన మూడు సార్లు జరిగింది.1967లో 520 సీట్లకు పెంచారు, 1976 లో 542 సీట్లకు పెంచారు.. తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543కి పెరిగింది. దక్షణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పకడ్బందీగా అమలు చేయడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాధిలో కుటుంబ నియంత్రణ అమలు కాకపోవడంతో జనాభా విపరీతంగా పెరిగింది.. ఇందిరాగాంధీ ఈ విషయాన్ని గమనించి లోక్ సభ సీట్ల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపును ఇందిరాగాంధీ నిషేధించారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన జరగొద్దనే సీట్లను నియంత్రించారు అని చెప్పారు. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్ట సవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకుచ 17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు 25 ఎంపీ సీట్లు వచ్చాయి... తెలంగాణకు 119 అసెంబ్లీ సీట్లు, ఎపీకి 175 శాసనసభ సీట్లు పెరిగాయి అని వివరించారు..2026 వరకు చట్టపరంగా సీట్ల పెంపు పైన నిషేధం విధించారు. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోమని దక్షణాది రాష్ట్రాలు నిరసన తెలపడంతో పాటు ప్రధానికి లేఖ రాశాయి. ఇప్పుడు రాష్ట్రాల వారీగా యాభై శాతం సీట్లు పెంచుతామని అంటున్నారు.20 సీట్లు ఉన్న కేరళకు, 80 సీట్లు ఉన్న యూపీకి ఉన్న అంతరం ప్రస్తుతం 60 సీట్లు మాత్రమే.. కాని యాభై శాతం పెంచితే 90 సీట్లకు గ్యాప్ పెరుగుతుంది అని చెప్పారు. తెలంగాణకు, యూపీకి 94 సీట్ల అంతరం పెరుగుతుంది. దక్షణాదిలో 130 సీట్లు ఉన్నాయి, 50 శాతం పెరిగితే 195 అవుతాయి. 413 సీట్లు ఉత్తరాదిలో ఉన్నాయి, పెంచితే 621 సీట్లు అవుతాయి. దక్షణాది, ఉత్తరాద మధ్య అంతరం 412 నుంచి 620 సీట్లకు పెరుగుతుంది అని చెప్పారు. డీలిమిటేషన్ వల్ల దక్షణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీరని విఘాతం అని పేర్కొన్నారు. ఏ ప్రాతిపదకన సీట్లు పెంచాలో మొదట చర్చించాలి.. యాభై శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పారు..? అని ప్రశ్నించారు. రాజకీయ అవసరాల కోసం 50శాతం సీట్లు అంటున్నారు.. దేశ మనుగడకు మంచి కాదు..ఇది రాజకీయ పార్టీలకు సంబంధించినది కాదు. 140 కోట్ల ప్రజలకు సంబంధించింది అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, నక్సలైట్ లాంటి సమస్యలు వివక్ష వల్లనే వచ్చాయి.. వివక్షను ఇంకా పెంచడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.33 శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, మహిళా రిజర్వేషన్లను ఆర్నెళ్లలోనే అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ అనేది చాలా ప్రమాదకర దిశలో వెళ్తోందని, చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం చేసే కుట్రను మోదీ చేస్తున్నారని దుయ్యబట్టారు. డీలిమిటేషన్ పేరుతో జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేసేందుకు అన్ని దక్షణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు దీనిపైన లేఖ రాస్తాను, కార్యాచరణను రూపొందించుకుంటూమని చెప్పారు.



బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో సర్‌పై అప్పీలు చేయడానికి ట్రిబ్యునల్ వద్ద వేచి ఉన్న ప్రజలు

## ఆరోగ్యానికి చెరుపు!

>> తొందరగా పండేలా చేస్తున్నారు. ఈ రసాయనాల ప్రభావంతో కాయలు కేవలం గంటల వ్యవధిలోనే పసుపు పచ్చని రంగులోకి మారిపోయి, చూడగానే పండిన పండ్లలా భ్రమింపజేస్తున్నాయి. బయట నుంచి చూస్తే ఎంతో ఆకర్షణీయంగా కనిపించే ఈ పండ్లను కట్ చేసి తింటే కానీ అసలు విషయం బయటపడటం లేదు. పైన రంగు మారినా లోపల మాత్రం అవి పచ్చిగానే ఉంటున్నాయి. అంతేకాకుండా, కాయలు త్వరగా పాడవకుండా ఉండేందుకు మరిన్ని రసాయనాలను వినియోగిస్తున్నట్లు ఇటీవలి దాడుల్లో పోలిసులు (హెచ్‌ఫాస్ట్ విభాగం) గుర్తించారు. ఇలాంటి విషపూరిత మామిడి పండ్లను తినడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారులు మామిడి పండ్లు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అతిగా మెరిసిపోయే పండ్ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

సాధారణంగా సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదు. కానీ రసాయనాలతో మగ్గించిన పండ్లు పైన పసుపు పచ్చగా ఉండి, లోపల మాత్రం పచ్చిగా ఉండి విషతుల్యంగా మారుతున్నాయి. ఇలాంటి పండ్లను తినడం వల్ల గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి తక్షణ సమస్యలతోపాటు దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ దెబ్బతినడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కార్బైడ్‌తో పండిన మామిడి పండ్లు డేంజర్ క్యాన్సర్ కారకాలుగా కూడా మారే ప్రమాదం ఉంటుంది. తెలంగాణ మామిడికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఏటా సుమారు ఆరు వేల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండగా అందులో వెయ్యి టన్నుల వరకు ప్రైవేటు కంపెనీల ద్వారా ముంబై, బెంగళూరుల మీదుగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. తెలంగాణలో ప్రధానంగా హిమాయత్, బంగినపల్లి, దశేరి వంటి రకాలు పండుతాయి. వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అయితే ఇతర రాష్ట్రాల నుండి హైదరాబాద్‌లోని గడ్డి అన్నారం, మొజంజాహి, ఎర్రగడ్డ , బాట సింగారం, పహడిషరీఫ్, బోయిన్‌పల్లి, పండ్ల మార్కెట్‌లకు మార్కెట్‌లో తోతాపురి, హిమాయతి, రసాలు, సుందరి, మల్లిక, కేసరి, దాసేరి, అపుసా, బెనిషన్ రకం మామిడిపళ్లు దిగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మామిడి పండ్లను తినేవాళ్లు ఆ మామిడి పండ్లు సహజసిద్ధంగా పండినవా లేక కృత్రిమ రసాయన కార్బైడ్ తో పండించిన మామిడి పండ్లా అనేది కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరముందని ఆహారనిపుణులు సూచిస్తున్నారు. మామిడి పండ్లు కొనేవాళ్లు ఆ మామిడి పండ్లు కార్బైడ్ తో పండించినవా లేక సహజంగా పండినవా అనేది తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటే మామిడిపండు ఏవిధంగా పండిందో అర్థం చేసుకోవచ్చు. కార్బైడ్‌తో పండించిన మామిడిపండ్లు, పండు మొత్తం ఒకే రంగులో, అక్కడక్కడ ఆకుపచ్చని, నల్లని మచ్చలతో ఉంటుంది. అదే సహజసిద్ధంగా పండిన పండు కాస్త ఎరుపు, పసుపురంగు కలిసిన మిక్స్ కలర్‌లో కనిపిస్తుంది. సహజంగా పండిన మామిడిపండ్లను నొక్కితే చాలా సాఫ్ట్‌గా, పండిన వాసనతో కమ్మగా అనిపిస్తుంది. అదే కార్బైడ్‌తో పండిన మామిడిపండు అంత సాఫ్ట్‌గా ఉండదు. వాసన కూడా పండు వాసన రాదు. కార్బైడ్ ఉపయోగించి పండించిన మామిడి పండ్లను నీళ్లలో వేస్తే అవి నీటిలో తేలుతాయి. అదే సహజసిద్ధంగా పండిన పండ్లు అయితే నీళ్లలో మునుగుతాయి. సహజమైన మామిడి పండు కుండే మృదుత్వం కార్బైడ్‌తో పండించిన పండుకు అస్సలు ఉండదు. కార్బైడ్‌తో పండించిన మామిడిపండు లోపల పండదు. లోపల తెల్లగానే కనిపిస్తూ పులుపుదనం వస్తుంది. కానీ ప్రకృతిసిద్ధంగా పండిన మామిడిపండు లోపల ఎర్రగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కల్తీ మామిడి పండ్ల సమాచారం తెలిస్తే డయల్ 100కి గానీ, హెచ్‌ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు హెచ్‌ఫాస్ట్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సూచించారు.

## హార్ముజ్ నౌకల దిగ్బంధం

>> పోర్టుల్లోను తమ నేవల్‌బ్లాకేడ్ అమలవుతుందని సెంట్‌కామ్‌ప్రకటించింది. ఇరానేతర పోర్టులకు వెళ్లే నౌకలను హార్ముజ్ జలసంధిలో అడ్డుకోబోమని చెప్పారు.

**ఎలాంటి చర్యలకైనా మేం సిద్ధమే...ఇరాన్ రక్షణమంత్రి**

హార్ముజ్ జలసంధిని దిగ్బంధించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న వేళఇరాన్ గట్టి హెచ్చరిక జారీ చేసింది. అమెరికా అలాంటి చర్యలకు దిగితే, తాము కూడా పర్షియన్ గల్ఫ్ తీరంలోని పోర్టులను దిగ్బంధిస్తామని హెచ్చరించింది. పర్షియన్‌గల్ఫ్, ఒమన్ సముద్ర తీరంలో భద్రత ఉంటే అందరికీ ఉండాలని, లేకపోతే ఎవరికీ ఉండకూడదని పేర్కొంది. ప్రాంతీయ సముద్ర జలాల్లో రక్షణ అందరికీ ఒకేలా ఉండాలని అభిప్రాయపడింది. హార్ముజ్‌ను అమెరికా దిగ్బంధిస్తే గల్ఫ్ తీరంలోని ఏ ఒక్క పోర్టుకు రక్షణ ఉండబోదని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ హెచ్చరించింది. తమ పోర్టుల్ని అమెరికా టార్గెట్ చేస్తే తాము గల్ఫ్ దేశాల పోర్టుల్ని టార్గెట్ చేస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ రక్షణమంత్రి బ్రిగేడియర్ జనరల్ సయ్యద్‌మాజిద్ ఇబ్లిన్‌తెజా మాట్లాడుతూ ఇరాన్ ఎలాంటి పరిస్థితికైనా సిద్ధమేనని మా సాయుధదళాలు అత్యంత సామర్థ్యంతో సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శత్రువులు ఎలాంటి హెచ్చరికలుచేసినా ఖాతరుచేయబోమని అన్నారు. ట్రంప్ చేస్తున్న ప్రకటనలు మిలిటరీ బ్లాకేడ్, నేవల్ బ్లాకేడ్ అనేవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘిస్తోందని, ఒకవిధంగా చెప్పాలంటే సముద్రపు దొంగగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని, ఇరాన్ పోర్టుల్ని దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిస్తూ అమెరికన్ నేవీకి ఆదేశాలు కూడా జారీ చేశారు. హార్ముజ్‌ను రెండు వైపులా నౌకల రవాణాను నిలిపివేస్తారు. హార్ముజ్ జలసంధి నుంచి ఇరాన్‌తో సంబంధం లేని నౌకల రవాణా మాత్రం కొనసాగుతోంది.

## అంబేద్కర్‌కు కెసిఆర్ నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్13:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతికి అంబేద్కర్ గారి కృషిని వారు చేసిన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. అన్ని రంగాల్లో వివక్షారహిత సామాజిక సమానత్వం కోసం, వర్ణ కుల మత లింగ బేధాలు లేకుండా భారతదేశ ఔన్నత్యాన్ని నిలిపే దిశగా కృషి చేసిన మహాదార్శనికుడు అంబేద్కర్ అని కేసీఆర్ అన్నారు. భారత సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక సంబంధాల్లో మానవీయత ఫరిడవిల్లి, విశ్వనరుడుగా భారత పౌరుడు ఎదిగేందుకు దోహదం చేసేలా, రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేద్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, దేశ ఫెడరల్ వ్యవస్థ బలోపేతానికి అంబేద్కర్ కృషి మహోన్నతమైనదని అన్నారు. దళిత బహుజన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఆశయాల సాధనకోసం మొదటి పదేండ్ల పాలనలో తెలంగాణ బిఆర్‌ఎస్ ప్రభుత్వం విప్లవాత్మక కార్యాచరణను అమలు చేసిందని గుర్తు చేశారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో డా. బి ఆర్ అంబేద్కర్ పేరుతో సచివాలయాన్ని నిర్మించుకుని, రాష్ట్ర పరిపాలనలో అంబేద్కర్ స్ఫూర్తిని నింపే దిశగా చర్యలు చేపట్టామని అన్నారు.

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

>> మౌలానా తెలిపారు. తెలంగాణ ఆర్టీసిలో గత 7 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎన్నిసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఆర్టీసి జాయింట్ యాక్షన్ కమిటీ అభిప్రాయపడింది. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఉన్న కార్మికులను కరీంనగర్, హైదరాబాద్ జోన్లకు బదిలీలు చేసే ప్రక్రియ చేపడుతూనే మరోప్రక్క మల్టీ ట్రేడ్ సిస్టమ్ ని తీసుకువచ్చి ఆర్టీసి కార్మికులను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని జాయింట్ యాక్షన్ కమిటి విమర్శించింది. జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన కారణంగా లేని సమస్యలను కార్మికుల ముందుకు తీసుకువచ్చి, కార్మికుల మనస్థైర్యాన్ని దెబ్బ తీసేవిధంగా ప్రభుత్వ, యాజమాన్యాలు మైండ్ గేమ్ ఆడుతున్నాయని విమర్శించారు. తాము ఇచ్చిన సమ్మె నోటీసులో ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం, ట్రేడ్ యూనియన్లను రెస్టోర్ చేయడం, వేతన సవరణలు జరపడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఈ నెల 22 మొదటి డ్యూటీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు ప్రకటించారు.

**ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశం కమిటీ పరిశీలనలో ఉంది: మంత్రి పొన్నం**

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టీసీ) ప్రభుత్వంలో విలీనం అంశం కమిటీ దగ్గర ఉందని, సిబ్బందికి సంబంధించి రెండు సమస్యలు తప్ప మిగిలిన వాటిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రేరేపిత సమ్మెలకు వెళ్లవద్దని, పెండింగ్ డీఏలను ఇచ్చామని, పీఆర్‌సీపై ఆలోచిస్తున్నామని మంత్రి తెలిపారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివ లింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సోమవారం నుంచి ఈ నెల 18 వరకు రోడ్ సేఫ్టీ కోసం పోలీస్, రవాణా శాఖ సంయుక్తంగా అరైవ్- అలైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రవాణా నిబంధనలు, ప్రమాదాలకు కారణాలు చర్చించి, వాటిని తగ్గించే చర్యలు తీసుకోవడానికి కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రవాణా శాఖ చర్యలు తీసుకుంటుందని, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. 6 రోజుల్లో అన్ని జిల్లాల్లో శాఖ పరంగా సమీక్షలు చేసుకుంటూ.. ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం లేకుండా చూడటమే కార్యక్రమ లక్ష్యమన్నారు. యాక్సిడెంట్ అయిన గంటలోపు గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో జాయిన్ చేస్తే.. రహవీర్ అవార్డ్ ఇస్తారన్నారు. చెక్ పోస్టులుఎత్తివేసి సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. అన్ని స్కూళ్లలో విద్యార్థులకు రవాణా నిబంధనలు వివరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు. ఆర్టీసీలో 30 ఏళ్ల సర్వీసులో ఉండి, ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని వారికి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. రోడ్ సేఫ్టీ సమావేశాలు ప్రతీ జిల్లాలో నిర్వహించాలని ఆదేశించామని మంత్రి స్పష్టం చేశారు.



# రేపు కాంగ్రెస్ నేతృత్వంలో అఖిలపక్షం

## మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు : ఖర్గే

**బెంగళూరు, ఏప్రిల్ 13:** కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపాదించనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. మహిళా బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో మీడియా సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు దేశవ్యాప్తంగా విస్తృత పరిణామాలు ఉన్నందున, దానిపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత వర్గాలన్నిటితో సమగ్ర సంప్రదింపులు జరిపేందుకు కేంద్రం సిద్ధంగా లేదని ఖర్గే ఆరోపించారు. తమ పార్టీ మహిళా రిజర్వేషన్ల చట్టానికి పూర్తి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై చర్చించేందుకు బుధవారం (ఏప్రిల్ 15) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఖర్గే తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

# విద్యుత్ సబ్సిడీగా రూ.14 వేల కోట్లు

## ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను టారిఫ్ రాయితీ (సబ్సిడీ) నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజి ట్రాన్స్‌కో) కు విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ సోమవారం 14 వేల కోట్ల రూపాయల మేర నిధులకు పరిపాలన మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అలాగే ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఈ నెల నుండి నెలవారీగా ఈ మొత్తాన్ని విద్యుత్ సంస్థ సమీకరించనుంది. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ముఖ్యంగా రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి రాయితీ కింద అమలు చేస్తున్న దృష్ట్యా అందుకు అయ్యే మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ మొత్తాన్ని ఈ ఏప్రిల్ నుండి నెలవారీ ప్రాతిపదికన సమాన వాయిదాలలో తీసుకోనుంది. ఈ లెక్కన నెలకు 1,166.67 కోట్ల రూపాయలను టారిఫ్ రాయితీగా ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ క్లైమ్ చేసుకోనుంది.



# లారీని ఢీకొన్న మినీబస్సు

## ఆరుగురు మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు

**హాపూర్(యుపి), ఏప్రిల్ 13:** వివాహ వేడుకలకు వెళ్లి తిరిగి వస్తున్న ఓ మినీ బస్సు ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 12 మందిలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బస్సు డ్రైవర్ సహా మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హాపూర్ జిల్లా లో దౌలానాగులవాటి రహదారిపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పెళ్లి వేడుకకు వెళ్లిన మినీ బస్సు వేడుక అనంతరం 12 మందితో తిరుగు పయనం అయ్యింది. మార్గమధ్యలో దౌలానాగులవాటి రోడ్డుపై ఎదురుగా వచ్చిన లారీ బస్సును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు పోలీసులు వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన ఏడుగురిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరణించిన ఆరుగురి మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించామని చెప్పారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు.



# లాలూపై సిబిఐ కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సీబీఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-09 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్‌డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదలీ చేశారని సిబిఐ ఆరోపణగా ఉంది.

# పత్తి ధరలు తగ్గితే నష్టాన్ని భరించనున్న ప్రభుత్వం

## మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువుంటే ఆ మొత్తాన్ని చెల్లించనున్న కేంద్రం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మార్కెట్లో పత్తి ధరలు పడిపోయినప్పుడు రైతులకు జరిగే నష్టాన్ని పూడ్చేందుకు ధర లోటు చెల్లింపు పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా పత్తి సాగు ఎక్కువగా ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఈ పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేయడం విశేషం. ఈ పథకం అమలులో భాగంగా ఒకవేళ పత్తికి మార్కెట్ ధర కనీస మద్దతు ధర కంటే తక్కువగా నమోదైతే, ఆ రెండు ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా జమ చేస్తుంది. దీనివల్ల రైతు తన పంట ను ఎవరికి కావాలంటే వారికి అమ్ముకునే స్వేచ్ఛ ఉండటమే కాకుండా, కనీస మద్దతు ధర అందలేదన్న ఆందోళన కూడా ఉండదు. గత కొంతకాలంగా పత్తి మార్కెట్‌లో ధరల అస్థిరత వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా మాత్రమే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయడం సాధ్యం కావడం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఆ కొరతను అధిగమించేందుకే ఈ ధర లోటు చెల్లింపు విధానాన్ని తెరపైకి తెచ్చింది. రైతులు తమ పత్తిని ఏపీఎంసీ యార్డులలో లేదా నోటిఫైడ్ మార్కెట్లలో అమ్మినప్పుడు, ఆ అమ్మకానికి సంబంధించిన ఆధారాలను సమర్పిస్తే నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఆ లోటు మొత్తాన్ని భరిస్తుం ది. దీని ద్వారా ప్రభుత్వ యంత్రాంగంపై భారం తగ్గడంతోపాటు రైతుకు రావాల్సిన మద్దతు ధర నేరుగా అందుతుంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారులు ఈ పథకం అమలుకు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారు. రైతుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, ఆధార్ లింకింగ్, బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించడంపై దృష్టి సారించారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవం తమైతే, దేశవ్యాప్తంగా పత్తి సాగు చేసే రైతులంద రికీ ఈ పథకాన్ని వర్తింపజేసే ఆలోచనలో కేంద్రం ఉంది.

# సిమెంట్ వ్యాన్‌ను ఢీకొన్న ఈకోవ్యాన్

## 11 మంది మృతి, మరికొందరికి గాయాలు

**థాణె, ఏప్రిల్ 13:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక సిమెంట్ మిక్సర్ వాహనాన్ని ప్రయాణికులతో వెళ్తున్న ఈకో వ్యాన్ ఢీకొన్న ఘటనలో 11 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన థానే జిల్లా, కల్యాణ్‌ముర్బాద్ నేషనల్ హైవే 61పై, గోవిలి గ్రామ సమీపంలోని రైతా బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం జరిగింది. 10.45 గంటల సమయంలో ఈకో వ్యాన్ కొంతమంది ప్రయాణికులతో కల్యాణ్ నుంచి ముర్బాద్ వెళుతూ ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మిగతా ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. రెండు వాహనాలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపోయాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు గుజరాత్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి ఓ ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు.



# రేపటి నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

## 30 వరకు దరఖాస్తులకు తుది గడువు

## జూన్ 9 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన 2026 మొదటి సెషన్ నోటిఫికేషన్ వెలువడింది. రేపటి (బుధవారం) నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించనున్నారు. టెట్ పరీక్షలను జూన్ 15 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఒక్కో పేపర్‌కి జనరల్, బీసీ అభ్యర్థులకు ఫీజు రూ. 750గా నిర్ణయించగా.. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఒక్కో పేపర్‌కి రూ. 700 కాగా.. రెండు పేపర్లకి కలిపి రూ. 950గా నిర్ణయించారు. 2026 టెట్ మొదటి సెషన్ నోటిఫికేషన్‌కి సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్య శాఖ డైరెక్టర్, టెట్ ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ సోమవారం జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కూడా టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో వారు కూడా టెట్ పరీక్ష తప్పకుండా రాయాల్సి ఉంటుంది.

సోమవారం టెట్-2026 మొదటి సెషన్ నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. రేపటి(బుధవారం) నుంచి ఆన్‌లైన్‌లో దరాఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనుండగా.. మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. జులై 28 నుంచి 31 మధ్యలో టెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. పాత పద్ధతిలోనే టెట్ పరీక్ష, అర్హత మార్కుల్లో ఎలాంటి మార్పులు లేవు. నిరుద్యోగులకు ఇన్ సర్వీస్ టీచర్లకి ఒకటే విధానంలో టెట్ నిర్వహణ. అర్హత మార్కులకి సంబంధించి జనరల్, ఈడబ్ల్యూఎస్ వారికి 60 శాతం కంటే ఎక్కువ, బీసీలకు 50 శాతం కంటే ఎక్కువ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు 40 శాతం కంటే ఎక్కువ మార్కులు రావల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రకటించింది.

# కాంగ్రెస్ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు

## బిజెపి సీనియర్ నేత, ఎంపి కె. లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** డీలిమిటేషన్ ప్రక్రియతోపాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు ద్వంద వైఖరి అవలంభిస్తున్నారని బిజెపి సీనియర్ నేత, ఎంపి డాక్టర్ కె. లక్ష్మణ్ విమర్శించారు. ఈ విషయమై సోమవారం బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్‌విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే చారిత్రాత్మక బిల్లును కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ముప్పై ఏళ్లుగా ఏదో ఒక సాకుతో మహిళా బిల్లును అడ్డుకుంటోంది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు.

యూపిఎ హయాంలో సోనియాగాంధీ మహిళా చైర్ పర్సన్‌గా ఉన్నప్పటికీ, కూటమి పార్టీల పేరు చెప్పి వెనక్కి తగ్గారే తప్ప, మహిళా సాధికారతపై, మహిళా రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌కు ఎప్పుడూ చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్లకు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధం ఏంటని ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రికి చట్టంపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో ఎస్సి,ఎస్టి పార్లమెంట్ సీట్ల సంఖ్య 84 నుండి 105 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీలోనూ ఎస్సిఎస్టిల సీట్లు పెరుగుతాయన్నారు. చట్టసభల్లో దళిత, గిరిజనులకు లభించే అధిక ప్రాతినిధ్యాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు.

మహిళలు అసెంబ్లీ, పార్లమెంట్ మెట్లు ఎక్కడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా..? అని నిలదీశారు. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు 130 పార్లమెంటు సీట్లు ఉంటే దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతమని, నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా లోక్‌సభ సీట్లు 816కు పెరిగితే దక్షిణాది రాష్ట్రాల సంఖ్య 195 అవుతుందని వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తన పంథాను మార్చుకోవాలని లేనిపక్షంలో మహిళలు, ఎస్సిఎస్టి సామాజికవర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలి

## పాఠశాల విద్యా సంచాలకుడు నవీన్ నికోలస్‌కు ఎస్టీయుటిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని ఎస్టీయూ టియస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్‌కి సంఘం నేతలు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తమిళనాడు రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానం మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సాధారణ టెట్ పరీక్షలతో పాటు సంవత్సరంలో మూడు సార్లు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించాలని ఎస్టీయూ టియస్ రాష్ట్ర అధ్యక్షులు జి. సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శులు జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు యం. పర్వత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఉండేదని, దీంతో గత కొన్నేళ్లుగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పరీక్షలకు దూరంగా ఉన్నారన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మహిళా మవోయిస్టు నేత మృతి

## సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డికి చెందిన రూపిపై రూ. 25 లక్షలు రివార్డు

## లొంగిపొమ్మంటే.. లొంగిపోకపోతివి బిడ్డా అంటూ రోదిస్తున్న తల్లి



ఎన్‌కౌంటర్‌లో రూపి మృతి చెందడంతో రోదిస్తున్న తల్లి, చెల్లెళ్లు

**మిరుదొడ్డి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో సోమ వారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ ఏరియా కమాండర్ రంగబోయిన భాగ్య అలియాస్ రూపి మృతి చెందడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ధర్మారం గ్రామానికి చెందిన రంగబోయిన నర్సయ్య లక్ష్మీ దంపతులకు నలుగురు సంతానం కాగా ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురైన భాగ్య అలియాస్ రూపి నక్సల్స్ ఉద్యమాలకు, ఆట పాటలకు ఆకర్షితులై (16) యేండ్ల వయస్సులో సుమారు 25 యేండ్ల క్రితం 2004లో మావోయిస్టు పార్టీలో చేరింది. రెండు దశాబ్దాలకు పైగా కుటుంబానికి దూరంగా ఉంటుంది. మావోయిస్టు దళ సభ్యురాలిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి మావోయిస్టు దళ కమాండర్‌గా పని చేస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ అయిన రూపీ అలియాస్ రంగబోయిన భాగ్య మృతి చెందింది. ఈమెపై గతంలో ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు సైతం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం మార్చి 31 వరకు మావోయి స్టులు లేని దేశంగా మారుస్తామని ప్రకటిం చగా కొంత మంది మావోయిస్టు అగ్ర నేతలు గణపతితో సహా కొంత మంది మిగిలి ఉండగా అందులో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు రూపీ అలియాస్ రంగబోయిన లక్ష్మీ ఉన్నారు. 9 యేండ్ల క్రితం తండ్రి నర్సయ్య మృతి చెందిన రూపీ రాలేదు.

మావోయిస్టు రహిత దేశంగా ఇటీవల మార్చి 31 వరకు కేంద్ర ప్రకటనతో కుటుంబీకులైన తల్లి లక్ష్మీ చెల్లెలైన కవిత, మమత, తమ్ముడు తమ అక్క రూపీ వస్తుందని ఎంతగానో ఆశగా ఎదురు చూశారు కానీ ఇంతలోనే పోలీసు ఎన్‌కౌంటర్‌లో రూపీ మరణించడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నారు. మావోయిస్టు రూపి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుటుం బీకులు శవాన్ని తీసుకురావడానికి రూపీ సోదరితోపాటు గ్రామస్తులు కలిసి ధర్మారం నుంచి ఛత్తీస్‌గఢ్ బయలు దేరారు. కాగా రూపీ లొంగిపోవాలని పలు మార్లు విన్నవించిన లొంగిపోలేదని తల్లి బోరున విలపిస్తుంది.

# డీలిమిటేషన్ ప్రక్రియపై సిఎం రేవంత్ ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

## అట్టడుగువర్గాల ప్రజల ప్రయోజనాలకు విఘాతం

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఫైర్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)పై సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధమని, అట్టడుగు వర్గాల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. "అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లు ఇవ్వాలా?. మీరు పుట్టిన పాలమూరుకు, వెనుకబడిన ఆదిలాబాద్ వంటి జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరం లేదా?." అని ప్రశ్నించారు. సోమవారం విలేకరుల సిఎం విలేకరుల సమావేశం ముగిసిన వెంటనే ఈ విషయమై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు మూటలు అదే పనిగా పంపుతున్న సిఎం రేవంత్.. ఇప్పుడు డబ్బు ప్రాతిపదికనే సిద్ధాంతాలు రచిస్తున్నారని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ ముక్కలు చేయాలని చూస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను చంపేసేలా సిఎం రేవంత్ వ్యాఖ్యలు ఉన్నాయని స్పష్టం చేశారు. అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుండి బహిష్కరించేవారని సంచలన వ్యాఖ్యలు చేశారు. డబ్బుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే బీజేపీ అంత్యోదయ సిద్ధాంతమని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతీ రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని నిర్ణయించిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. కాంగ్రెస్ ముమ్మాటికీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. అయిదు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ ఎందుకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో పార్లమెంట్‌లో మహిళా బిల్లు కాపీలు చించివేసిన ఆర్జెడి, సమాజ్‌వాది పార్టీలతో కాంగ్రెస్ ఇప్పుడూ అంటకాగుతోందని గుర్తు చేశారు. ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ నైజాన్ని బయటపెట్టాయని, విభజన రాజకీయాలు చేయడం మానుకొని ఇప్పటికైనా నిజం మాట్లాడాలని హితవు పలికారు. తాను బతికున్నంత కాలం కాషాయ జెండాను వీడనని, కరీంనగర్ ప్రజల మధ్యే ఉంటానని స్పష్టం చేశారు.



ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న విజయశాంతిరెడ్డి (ఫైల్)

# చర్లపల్లి రైల్వేస్టేషన్ ఆత్మహత్యల కేసులో కొత్త ట్విస్ట్

## ప్రాణభయం ఉందని పోలీసులను ఆశ్రయించిన విజయశాంతిరెడ్డి భర్త

**హైదరాబాద్ (ఉప్పల్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐటీ ఉద్యోగిని విజయశాంతిరెడ్డి కేసులో తాజాగా మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. మృతురాలు విజయశాంతిరెడ్డి భర్త సురేందర్‌రెడ్డి తన ప్రాణాలకు హాని ఉందని మేడిపల్లి పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. విజయారెడ్డి తల్లి, సోదరులు ఆస్తి కోసం ఎంతకైనా తెగిస్తారని తన ఫిర్యాదులో పేర్కొనడం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత జనవరి 31న బోడుప్పల్ చెంగిచర్ల హరితవనం కాలనీలో నివాసం ఉంటున్న పిన్నింటి విజయ అలియాస్ విజయశాంతిరెడ్డి (38), కూతురు చైతన్యరెడ్డి (18), కొడుకు విశాల్‌రెడ్డి (17) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాత్రి తమ కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లిన ముగ్గురు అనంతరం సనత్‌నగర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి అప్పట్లో ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, విజయారెడ్డి చనిపోయాక ఆస్తి వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో విజయా రెడ్డి తల్లితో సహా ఆమె సోదరుడిపై సురేందర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సొంత వాళ్లే నా కుటుంబాన్ని నాశనం చేశారని, నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకు నేంత పిరికివాళ్లు కాదన్నారు. వాళ్లు చనిపోయిన 25 రోజులకే నన్ను కూడా ఆస్తి కోసం బెదరించారని తెలిపారు. తన అత్త విజయారెడ్డి తల్లి, బామ్మర్ది చిరంజీవి, అతని భార్య వేధింపులు, ఆస్తి కోసం వాళ్లు ఒత్తిడి చేయటం వల్లే విజయారెడ్డి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. తాను చనిపోతే ఆస్తులు తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు రాస్తానని ఆయన తెలిపారు. వారితో నాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసు మరోసారి చర్చనీయాం శంగా మారింది. పోలీసులు అన్ని కోణాలలో విచారణ చేస్తున్నారు.

# ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## గిరిజన ఎమ్మెల్యేలు సిఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 13:** ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతు ఆదివాసీ,గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాం ల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చునని ఆయన అన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ...ప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఆయన వారికి హామీ ఇచ్చారు. ఐటీడీఏ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, బోధన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
లేఖ.No. E1/E2/91/ఏప్రిల్/Ad/2026 తేది: 13.04.2026
బోధన్ పట్టణంలో వివిధ గ్రాంట్ల క్రింద 05నం. ప్రతిపాదిత పనులకు టెండర్లు కోరబడుతున్నవి. అన్ని పనుల యొక్క మొత్తం అంచనా ధర రూ.21.50 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది: 13.04.2026 సా.04.00గం. వద్ద మరియు బిడ్ దాఖలు చివరి తేది: 17.04.2026. తదుపరి వివరాలకు బోధన్ మునిసిపాలిటీ ఇంజనీరింగ్ సెక్షన్‌ను దయచేసి సంప్రదించండి. ఇమెయిల్ ఐడి: municipalcouncilbodhan@gmail.com, https://tender.telangana.gov.in
సం/-.కమిషనర్, మునిసిపల్ కౌన్సిల్ బోధన్.
DIPR.NO. 556-PP/CL/ADVT/1/2026-27 తేది: 13.04.2026

వార్త


ఒక్కోసారి మనం చేయగలిగే పనుల కన్నా, చేయలేని పనులు తెలుసుకోవడం చాలా అవసరం.

- డిజరైలి

# ప్రాణాలు తీస్తున్న చదువులు!


మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనసును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇవి రానురాను పెరిగిపోతుండడం అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నది. విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావి భారత పౌరులను చూసి భారతావని నివ్వెరపోతున్నది. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చి కుటుంబంలో కాంతులు వెదజల్లే దీపాల్లాంటి వారు భవిష్యత్తులో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన దివ్వెలు ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని, పెంచిన వారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరుగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడి తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనదే కాదనలేని వాస్తవం. ఈ యేడాది ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడిన నిన్న ఆదివారం నాడే ఏకంగా ఏడుగురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఇంటర్మీడియేట్ ఫలితాల భయంతో మరొక విద్యార్థి ఫలితాలు వెలువడకముందే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా భోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియేట్ మొదటిసంవత్సరం పరీక్షలు రాసాడు. పాస్ కాననే భయంతో గత గురువారం రాత్రి ఒక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణుడయ్యాడు. ఇక హైదరాబాద్‌లో ఇద్దరు విద్యార్థులు, మెదక్ జిల్లాలో మరొక విద్యార్థి, మహబూబ్‌నగర్‌లో, భూత్‌పూర్‌లో, సూర్యాపేటలో ఒక్కొక్క విద్యార్థి మొత్తం ఏడుగురు ఆత్మహత్యలు చేసుకున్నారు. పరీక్షా ఫలితాలు వస్తున్నాయంటే విద్యార్థుల్లోనే కాదు తల్లిదండ్రుల్లో కూడా విపరీతమైన ఒత్తిడి పెరిగిపోతున్నది. దేశవ్యాప్తంగా కూడా ఈ బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. 2017లో దేశంలో లక్షా ఇరవై తొమ్మిది వేలమంది తమ ప్రాణాలు తీసుకుంటే 2023 నాటికి ఆ సంఖ్య లక్షా డెబ్బైవేలకుపెరిగింది. ఇవన్నీ అధికారిక లెక్కలే. వివిధ కారణాలరీత్యా వెలుగు చూడని మరణాలు కూడా ఎన్నో ఉన్నాయి. మరికొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఆ గర్భశోకాన్ని భరించలేక అనారోగ్యంపాలై తనువు చాలిస్తుంటే మరికొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు. గతంలో తమిళనాడులో మెడికల్ కాలేజీ ప్రవేశ అర్హత కోసం నీట్ పరీక్షల్లో రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలమై మూడోసారి వస్తుందో లేదో అనుమానంతో పంతొమ్మిదేళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇంటికి చేరుకొనేసరికి కుమారుడు చనిపోయి ఉండటం చూసి జీర్ణించుకోలేకపోయాడు. తల్లిలేని కుమారుడిని ఎంతో ప్రేమానురాగాలతో తల్లీతండ్రి తానేఅయి అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు కళ్లముందే కడతేరిపోవడంతో బాధను భరించలేకపోయారు. అంత్యక్రియలు పూర్తి చేసి అదే రాత్రి ఆ తండ్రి కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రధానంగా శిక్షణా సంస్థలకు కేంద్రాలుగా పేరుగాంచిన రాజస్థాన్‌లోని 'కోటా'లో ప్రతి యేడాది పదుల సంఖ్యలో బలవన్మరణాలు చోటుచేసుకుంటున్నాయి. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై ర్యాంకులు సంపాదించి ప్రతిష్టాకరమైన ఐఐటిల్లో, మెడిసిన్‌లో సీట్లు సంపాదించి ఆనందంగా చేరుతున్న విద్యార్థులు కూడా ఆతర్వాత అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. 2018-23 వరకు ఐఐటిల్లో చదువుతున్న మెరికల్లాంటి ముప్పై మూడు మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ బలవంతపు చావులకు కారణాలు ఎన్నో ఉన్నా, కారకులు ఎందరో ఉన్నారు. ప్రాచీన భారత విద్యా విధానంలో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. నలంద, తక్షశిలతదితర విశ్వవిద్యాలయాల్లో పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి కూడా విద్యార్థులు వచ్చేవారు. అప్పటి తరగతి గదుల్లో తక్కువగా బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ బడులే కానీ ప్రైవేట్ బడులు అంతగా ఉండేవి కావు. ఒకటి, రెండు ఉన్నా వాటి నిర్వాహకులు లాభాపేక్ష లేకుండా విద్యాబోధనే లక్ష్యంగా నడిపేవారు. కానీ రానురాను విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందింది. మారుతున్న కాల, మాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి కారణాలు ఎన్నో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానానికి రూపకల్ప దిశగా మేధావులూ ఆలోచించాలి. ఈ బలవంతపు చావుల నుంచి విద్యార్థి లోకాన్ని బయటపడేసేందుకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులను దేశం కోల్పోతుంది.

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహ బలం వాటంతట అవే సమకూరుతాయి.



థామస్ ఫుల్లర్

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



### అవగాహన అవసరం

మూడువందలకోట్లరూపాయల గ్లోబల్ సైబర్‌ఫ్రాడ్ సిండికేట్ గుట్టురట్టు కావడం సంచలనం సృష్టించింది. ఈ ముఠా అరెస్ట్ ఆహ్వానించదగ్గ పరిణామం అయినప్పటికీ, దీని వెనుక ఉన్న భయంకరమైన వాస్తవాలను మనం విస్మరించకూడదు. 2,567 ఫిర్యాదులు, 260 బ్యాంకు ఖాతాలు, 100కు పైగా నకిలీ కంపెనీల నెట్‌వర్క్ ఈ నేరగాళ్ల ఎంతటి సాంకేతిక నైపుణ్యంతో పని చేస్తున్నారో స్పష్టం చేస్తోంది. ఈ నేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధికలాభాలు వస్తాయనే ఆశ చూపి ప్రజలను వంచించారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈమాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోయారు. ఇటువంటి నెట్‌వర్క్ ద్వారా జరిగే భారీ దోపిడీలను అరికట్టడానికి వ్యవస్థలో మార్పులు రావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇదా మన దేశాభివృద్ధి ?

మనిషికి కావలసిన అన్ని సౌకర్యాలు కలిగించటం, అవసరాలు తీర్చటం, పంటలు ఎక్కువగా పండించటం ఇదీ అభివృద్ధి. నిజమైన అభివృద్ధి అంటే ఇదీ. మరి ఈరోజు మననాయకులు మనకు చెప్పేఅభివృద్ధి ఏంటీ?తిరుపతి వెంకన్న దర్శనానికి 24గంటలు, ఈరోజు దర్శనం లక్ష మంది, ఈరోజు ఎభైయ్‌వేలమంది గుండు కొట్టించుకున్నారు, ఈరోజు హుండీ లెక్క ఐదుకోట్లు , ఇలా చెప్పుకుంటున్నారు. దేవునితో ఒకరోజు, దేవునితో ఒక గంట ఏమిటో తెలియదు. అలా అంటే వాళ్ల దేవుళ్లకే అవమానం కదా. గతంలోజరిగిన కుంభమేళాలో60కోట్లమంది మునిగారు, ఈసారి వందకోట్లు దాటాలి. ఇదాఅభివృద్ధి? ప్రభుత్వాలు మనిషికి కావలసిన భౌతిక అవసరాలు గుర్తించి వాటిని అభివృద్ధి చెయ్యాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### సమయ పాలన పాటించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసులలో సమయానికి రాకుండా వారి ఇష్టమొచ్చిన సమయానికి వస్తూ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు విచ్చేసిన ప్రజలనుఇబ్బంది పెడుతున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించని వైనం. ఉద్యోగులు సమయానికి ఆఫీసులో ఉంది ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఒకే ఎడ్యుకేషనల్ బోర్డు ఉండాలి

దేశవ్యాప్తంగా కామన్ కరికులం ఉండాలి. ఇన్ని ఎడ్యుకేషనల్ బోర్డులు కాకుండా ఒకే బోర్డు ఉండాలి. కంపల్సరీగా మాతృభాష రాష్ట్రానికి సంబంధించిన భాష ప్రథమభాషగా ద్వితీయ భాష హిందీ, తృతీయ భాష ఇంగ్లీష్ ఉండాలి. సోషల్ స్టడీస్‌కు బదులుగా ఆరవతరగతి నుండి పన్నెండవ తరగతి వరకు జాగ్రఫీ, ఎకనామిక్స్ కాన్స్టిట్యూషన్ మూడు విభాగాలుగా స్థాయిని బట్టి సిలబస్‌లో చేరే విధంగా సోషల్ స్టడీస్ ఉండాలి. ఆరవ తరగతి నుండి ఫిజికల్‌సైన్స్ బయలాజికల్ సైన్స్ విడిగా( జనరల్ సైన్స్ )కాకుండా రెండు సబ్జెక్టులుగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు కులాలఆధారంగా మాత్రమే తొలిసారి ఉద్యోగం పొందడానికి ఏ మతం వారైనా ఏ ప్రాంతం వారైనా వారికి మాత్రం ఒక్కసారి రిజర్వేషన్ ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు ఉండకూడదు. వారు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి. గ్రామంలోసర్పంచ్ మొదలైన వారి పిల్లలు పట్టణాల్లో చదివించే ప్రయత్నంచేస్తే వారికినచ్చజెప్పేబాధ్యత ఉపాధ్యాయులదే.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అధిక బస్సులు నడపాలి

విజయవాడ ప్రాంతం నుంచి రాయచూర్‌కు అధిక బస్సులు నడపాలి. విజయవాడలో నివాసంఉంటున్నవారికి చాలా మందికి రాయచూర్ ప్రాంతంలో సత్సంబంధాలు ఉన్నాయి. సాయంత్రం విజయవాడ నుంచి బస్సు బయలుదేరితే, ఉదయమే బస్సు రాయచూర్‌కు చేరుతుంది. రాత్రి అంతా ప్రయాణం చేస్తే ఉదయం చేరుకుంటారు. కాబట్టి ఈ ప్రయాణానికి చాలా మంది ఇష్టపడతారు. కావున విజయవాడ డిపోవారు రాయచూర్‌కు బస్సు నడుపుటకు చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ వారు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజా రవాణా సౌకర్యవంతంగా ఉండేలా చూస్తే బాగుంటుంది.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### ఉపాధి హామీ మంచి ఆలంబన

ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసం అయినా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరణ చేసే అవకాశం ఉపాధిహామీకి ఉందా అంటే అవుననే సమాధానం వస్తుంది. ఉమ్మడిరాష్ట్రంలో డిసెలటింగ్ చేయక నీరు భూమిలోపలికి ఇంకక చెరువుల పూడికకు నిధులు మంజూరు చేయక ధ్వంసం అయినా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు కొంచం బాగుపడే స్థితికి చేరుకున్నది. తెలంగాణలో ఇప్పుడు మళ్లీ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కావడానికి ఉపాధి హామీ మంచి ఆలంబన కాగలదు.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అంబేద్కర్ అందరివాడు

స్వాతంత్య్రం సాధించిన తర్వాత కూడా చాలా మంది అణగారిన వర్గాలు, ముఖ్యంగా దళిత పురుషులు మహిళలు నిరక్షరాస్యతకు ప్రధాన బాధితులుగా ఉన్నప్పటికీ, అంబేద్కర్ నేతృత్వంలోని ఉద్యమం నేడు ఫలాలను ఇస్తోంది. విద్య బలహీన వర్గాల విముక్తికి కీలకమైన మార్గదర్శిగా ఉద్భవించింది. చివరగా అంబేద్కర్‌గారు చెప్పినది 'నన్ను దేవుడిలాగా చేయకండి నన్ను ఆయుధంలా చేసి పోరాడండని' కోరారు. ప్రస్తుత ఆధునిక సమాజం ఆయన చెప్పిన విషయాలను సమాజం ముందు పెట్టిన విమర్శలు, అభిప్రాయాలు, అనుసరించిన వాటిని తెలుసుకుని, సమాజంలో సమసమాజ నిర్మాణానికి, కులవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం, సమైక్యతకు విఘాతం కలిగించే మనువాదాన్ని నిర్భయంగా తిరస్కరించడమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నిజమైన నివాళి కాగలదని, అందుకు యువత ప్రత్యక్షంగా అంబేద్కర్ కలలుగన్న ఆధునిక సమాజ స్థాపనకు కృషిచేయాలి.



డాక్టర్ ఎ. భాగ్యరాజ

ఈ ప్రపంచంలోనే ఎక్కువ విగ్రహాలున్న మహనీయుడు అంబేద్కర్. అలాగే పగులగొడుతున్న విగ్రహాలు అంబేద్కర్ గారివే. ఆయన విగ్రహాలను నాశనం చేయవచ్చుకాని సిద్ధాంతాలను కాదు. ఈ దేశంలో కృష్ణుడు సనాతనాన్ని (హిందూయిజాన్ని), మొఘల్స్ ఇస్లాంని, బ్రిటీషర్స్ క్రైస్తవాన్ని బోధించారు కానిఅంబేద్కర్ లాంటివారు మనల్ని మనుషులుగా మార్చిన మహనీయుడు. చరిత్రకారులు చరిత్రను క్రీస్తు పూర్వము, క్రీస్తు శకం అని ఏవిధంగా విభజించారో అదే విధంగా ఆధునిక భారతాన్ని అంబేద్కర్ పూర్వం, అంబేద్కర్ తరువాత అని చూడవచ్చు. ఎందుకంటే మన తలరాతలు అలా రాసివుంది ఏం చేద్దాం అని వెనుకబడిన వర్గాలు, కార్మికులు, ముఖ్యంగా మహిళలు అంటూ ఉండే వారు. కానీ అంబేద్కర్ రాక అన్ని అపనమ్మకాలు, పుక్కిట పురాణాలు తలక్రిందులైనాయి. ప్రస్తుతమున్న సమాజం, రాజకీయ నాయకులు అంబేద్కర్ ఒక రిజర్వేషన్ను మాత్రమే అందించారు అని ప్రచారం చేస్తున్నారు. కానీ ఆయన ఒక వెనుకబడిన వర్గాల వారికి మాత్రమే కాదు అన్ని తరగతుల మహిళలకు, కార్మికులకు చేసిన మేలు ఎవరూ చేయలేదని మరిచిపోతున్నారు. ఆయన సాధించి పెట్టిన ప్రతి హక్కులు వెలకట్టలేనివి. అందరూ సమానం కాదు, ఎక్కువ తక్కువ అని తెలుసుకుని జీవించడమే ధర్మం. అలాగే జీవించాలని నాలుగు వర్ణాలను సుమారు నాలుగు వేల కులాలుగా విభజించి ఒకరికి ఎక్కువ, తక్కువగా ఒకరుండడమే న్యాయమని చెప్పబడిన భారత మనుధర్మం, విద్య నేర్చుకోకూడదు, దారిలో నడవకూడదు, మొత్తానికి బానిసగా ఉండాలని, ఏ పని చెబితే ఆ పని చేయవలసిన పరిస్థితులలో అంబేద్కర్ రాక మొత్తం పరిస్థితినే మార్చేసింది. వెనుకబడిన వర్గాలకు, మహిళలకు నిరాకరించబడిన హక్కులకోసమే తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసారు. అంబేద్కర్ గారు ఎంత కాలం జీవించారు అనే దానికంటే ప్రస్తుతం వెనుకబడిన వర్గాలు, మహిళలు గర్వంగా, మర్యాదగా బ్రతుకుతున్నారంటే దానికి కారణమైన అంబేద్కర్ జన్మదినాన్ని వేడుకలా జరుపుకొని ఆయన ఆశయాలను పాటించాలి. సామాజిక న్యాయం అనేది న్యాయమైన సమాజాన్ని సృష్టించడానికి ఒక సాధనమని, దానికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అవసరమని అంబేద్కర్ విశ్వసించారు. సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం పోరాడిన సామాజిక సంస్కర్త అంబేద్కర్. సామాజిక న్యాయం ప్రతి మానవుడి స్వేచ్ఛ, సమానత్వం సోదరభావంపై ఆధారపడి ఉంటుందన్నారు. సామాజిక న్యాయం వ్యక్తులకు రాజకీయ, ఆర్థిక వనరులు హక్కుల సమాన పంపిణీని తెస్తుంది. ఒక వ్యక్తి హోదా పుట్టుక ఆధారంగా కాకుండా యోగ్యత ఆధారంగా ఉండే సమాజం కోసం ఆయన వాదించారు. మహిళా, కార్మిక సమానత్వపు పోరాట యోధుడు ఆయన సామాజిక సంస్కర్త, ఆర్థికవేత్త, న్యాయవాది భారత రాజ్యాంగ నిర్మాత. రాజ్యాంగ రచనలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగంలో కులవివక్ష, అంటరానితనాన్ని నిషేధించే నిబంధనలు ఉండేలా ఆయన చూసుకున్నారు. రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వంసోదరభావం అనే సూత్రాలను పొందుపరిచారు. సమానత్వపు హక్కు అంటే అందరూ సమానంగా చూడడం కాదు అందరికీ సమాన అవకాశాలు సమాన హక్కులను ఇవ్వడమే. అదే వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కోసం తన పదవినే తృణప్రాయంగా వదిలిన నవ బుద్ధుడు. 1942లో 14 గంటల పని సమయమున్న దానిని 8 గంటలు చేసిన మహనీయుడు. మగవారితో స్త్రీలు సమానమని, దానితోపాటు సమాన వేతనాన్ని పోరాడి తెచ్చింది అంబేద్కర్ గారని మరువకూడదు. అందుకే హిందూకోడ్ బిల్ మహిళలకు వంశపారంపర్య ఆస్థిలో సమానవాటా, పిల్లలనుదత్తత తీసుకునే హక్కు, విడాకుల హక్కులను చేర్చారు. చీమలకు చక్కెరను, దాహానికి నీరుని ఇచ్చే మనిషికి జాతి, మతమెందుకు అని అడిగిన దార్శనికుడు. ఏ అంబేద్కర్‌కి చదువు చెప్పడానికి నిరాకరించారో, నీళ్ల ఇవ్వడానికి నిరాకరించారో, ఏ అంబేద్కర్‌కి ఇల్లు ఇవ్వమని చెప్పారో, ఏ అంబేద్కర్‌ని బండి ఎక్కించము అని చెప్పారో అదే అంబేద్కర్ రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షులుగా పార్లమెంట్ లోపలికి అడుగు పెడుతుంటే వారే అందరూ లేచి నిలబడి గౌరవించారు. అదే చరిత్ర అదే అంబేద్కర్. తన బాల్యజీవితంలో మర్యాదే లేదు, ఎటువంటి సౌకర్యం లేదు. అటువంటి కాలంలో దొరికిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని అకుంఠిత దీక్షతో రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకు, మహిళలకు, కార్మికులకు సమానత్వాన్ని, హక్కులను, గౌరవాన్ని సాధించి పెట్టారు. కానీ ఇప్పుడున్న పరిస్థితులలో ల్యాప్టాప్ (కంప్యూటర్) లేదంటే చదవలేమని, ఏసీ లేదంటే చదవలేమని చెప్పే పిల్లలుంటే, ఆ కాలంలో చదువే నిరాకరించబడిన అంబేద్కర్ ఆ స్థాయికి చేరడంటే అతని పట్టుదల, అణగారిన వర్గాలకి, మహిళాలోకానికి అందించిన హక్కులు అతని చొరవే. ఆయన ఒక ఆధునిక సవ్యసాచి, అతను రాసి రాసి కుడిచేయి వ్రేలు బొబ్బలెక్కితే ఎడమచేతితో అలవాటు చేసుకుని వ్రాసిన మహనీయుడు. విద్యా రంగానికి అంబేద్కర్ చేసిన కృషి, విద్యారంగంపైఆయన అభిప్రాయం అన్ని సామాజిక రుగ్మతలకు విద్య ఒక్కటే గొప్ప ఔషధం అని ఆయన నమ్మారు. విద్యప్రాముఖ్యతను గ్రహించడానికి ఆయన దేనిని వదిలిపెట్టలేదు. ఉన్నత విద్య అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. విద్య మానవ సమాజంపై అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది మానవ మనస్సునుతలో చించడానికి సరైన నిర్ణయం తీసుకోవడానికి శిక్షణ ఇస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, మానవులు విద్యావంతులైనప్పుడు హేతుబద్ధంగా మారతారు. విద్య ద్వారా మాత్రమే జ్ఞానం సమాచారం అందుతుంది. చదువురాని వ్యక్తులు చదవలేరు, వ్రాయలేరు ప్రాపంచిక జ్ఞానం వారికి మూసివేయబడతాయనీ, దీనికి విరుద్ధంగా విద్యావంతుడైన వ్యక్తి ప్రాపంచిక జ్ఞానాన్నిపొందుతారు. విద్య అంటే జ్ఞానాన్ని సంపాదించడం లేదా విద్యాహోదా పొందడం మాత్రమేకాదు. ఇది మనస్సు, స్వేచ్ఛా ఆలోచనను సృష్టించడానికి దారితీయాలి అని చెప్పిన మహిమాన్వితుడు. ఆయన మరణించిన ఐదు దశాబ్దాల తర్వాత, అమలు చేయబడిన విద్యా హక్కు చట్టం (2009)లో అంబేద్కర్ అనేక ప్రగతిశీల ఆలోచనలున్నాయి. ఆయన అన్ని సామాజిక, ఆర్థిక వర్గాల పిల్లలకు ప్రాథమిక విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి దృఢమైన పునాది వేయాలని పట్టుబట్టారు. వాస్తవానికి 1950లోనే ఆయన రాజ్యాంగంలో తప్పనిసరి ప్రాథమిక, ఉచిత విద్య కార్యక్రమానికి మార్గం సుగమం చేసి విద్యాహక్కు చట్టానికి బాటలు వేసిన నిజమైన మార్గదర్శి. అంబేద్కర్ విద్యను వాణిజ్యీకరించడాన్ని వ్యతిరేకించాడు, విమర్శించాడు. పురుష విద్యను స్త్రీ విద్యతోపాటు కొనసాగిస్తే మన పురోగతి చాలా వేగవంతం అవుతుందని చెప్పారు. ఆయన ఆలోచనలు ఆవిష్కరణలు ఆచరణాత్మకమైనవి, వాస్తవానికి అతను మహిళలకు, బలహీన వర్గాలవారికి ఆదర్శంగాఉన్నారు. స్వాతంత్య్రం సాధించిన తర్వాత కూడా చాలా మంది అణగారిన వర్గాలు, ముఖ్యంగా దళిత పురుషులు మహిళలు నిరక్షరాస్యతకు ప్రధాన బాధితులుగా ఉన్నప్పటికీ, అంబేద్కర్ నేతృత్వంలోని ఉద్యమం నేడు ఫలాలను ఇస్తోంది. విద్య బలహీన వర్గాల విముక్తికి కీలకమైన మార్గదర్శిగా ఉద్భవించింది. చివరగా అంబేద్కర్‌గారు చెప్పినది 'నన్ను దేవుడిలాగా చేయకండి నన్ను ఆయుధంలా చేసి పోరాడండని' కోరారు. ప్రస్తుత ఆధునిక సమాజం ఆయన చెప్పిన విషయాలను సమాజం ముందు పెట్టిన విమర్శలు, అభిప్రాయాలు, అనుసరించిన వాటిని తెలుసుకుని, సమాజంలో సమసమాజ నిర్మాణానికి, కులవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం, సమైక్యతకు విఘాతం కలిగించే మనువాదాన్ని నిర్భయంగా తిరస్కరించడమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నిజమైన నివాళి కాగలదని, అందుకుయువత ప్రత్యక్షంగా అంబేద్కర్ కలలుగన్న ఆధునిక సమాజ స్థాపనకు కృషిచేయాలి. ●



నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

అగ్ని ప్రమాదాలు వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్ట్స్, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలుఅందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతిక్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగలిగితే, ఎక్కువ నష్టంకలుగకుండా నివారించవచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియ చేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుద్ఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండాకాలంలో



ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్టవచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లోప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండా ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలోగాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటిసామర్థ్యం గల ట్యాంకులనుఅమర్చుకోవాలి. నీళ్ల తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్‌కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చుకోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యాసంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయోగించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం, వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయబడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారినిపిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారుపడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పుకోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి. ●

# యుద్ధం ప్రపంచశాంతికి ప్రమాద సంకేతం

జి.సత్యనారాయణరాజు

అమెరికా ఎప్పుడు ఏది చేసినా అది తమ దేశానికే కాదు ప్రపంచానికి ప్రమాదకరం అని మరోమారు రుజువైంది. తాజాగా ట్రంప్ దుందుడుకు విధానాల వల్ల ప్రపంచం దాని మూల్యం చెల్లించుకుంటోంది. ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేస్తాం, నాగరికతే లేకుండా చేస్తామంటూ గర్జించిన అమెరికా చివరకు ఇరాన్‌తో కాళ్లబేరానికి వచ్చింది. తొలిసారిగా ఎప్పుడైతే ఐదురోజులపాటు కాల్పుల విరమణ అందో ఆ రోజే ఓడిపోయింది. సీజ్ ఫైర్ తర్వాత తాజాగా అమెరికా షరతులను ఇరాన్ ఒప్పుకోవడం లేదు కానీ, ఇరాన్ షరతులను మాత్రం అమెరికా ఒప్పుకుంటోంది. యుద్ధానికి వెళ్లినప్పుడు గెలిచిరావాలి. లేదంటే ఓడి రావాలి. కానీ అమెరికా తెలివిగా కాల్పుల విరమణ పేరుతో ఒప్పందాలు కుదుర్చుకొని ఎస్కేప్ అవుతుంటుంది. అంటే ఎక్కడా అమెరికా ఓడిపోయింది అనే పేరు రాకుండా చూసుకోవడానికి, తన గౌరవానికి భంగం వాటిల్లకుండా, ప్రపంచ దేశాల్లో చులకన కాకుండా ఇలాంటి ఎత్తుగడలు వేస్తుంటుంది. అగ్రరాజ్యం అమెరికా అంటే అత్యాధునిక ఆయుధాలుంటాయి. సమర్థవంతమైన గూఢచారి వ్యవస్థ ఉంటుంది. బిన్‌లాడెన్ లాంటి వారిని పాకిస్థాన్ దేశానికి కూడా తెలియకుండా ఆ దేశంలోకి వెళ్లి చంపిరాగల రాటుదేలిన బృందాలున్నాయి. అద్భుతమైన రక్షణ వ్యవస్థను నడిపించే పెంటగాన్ ఉంది. అమెరికా అంటే అందరూ అమ్మో అనుకుంటారు. కానీ అవన్నీ కేవలం ఎండమావిలాంటివే. ఎందుకంటే అమెరికా కేవలం యుద్ధం అంటే గర్జనలకే పరిమితమవుతుంది కానీ ఆ యుద్ధాన్ని గెలవలేదు. మధ్యలోనే ఒప్పందాలు కుదుర్చుకొని వెనక్కి తిరిగివచ్చేస్తుంది. దీనికి కారణం ఆ దేశంలో భరించలేనంత స్థాయికి యుద్ధ వ్యయం పెరుగుతుంది. రెండు దశాబ్దాలకుపైగా సైనిక చర్యల కోసం అమెరికా దాదాపు 5.8 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు రానున్న రోజుల్లో మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణ కోసం మరో 2.2 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని తెలుస్తోంది. మొత్తంగా 2001 నుంచి యుద్ధాలపై అమెరికా పెట్టే ఖర్చు సుమారు 8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని చెబుతున్నారు. రెండున్నర దశాబ్దాల్లో అమెరికా యుద్ధాలకారణంగా దాదాపు తొమ్మిదిలక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వీరి



లో దాదాపు సగం మంది సామాన్యులేనని చెప్పింది. ఆహారం, వైద్యం, యుద్ధ సంబంధిత వ్యాధులతో అనేక మంది మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలో వియత్నాం యుద్ధం ఒక మాయనిమచ్చ. దశాబ్ద కాలం పోరాడినా కమ్యూనిజాన్ని ఆపలేక, స్వదేశంలో ప్రజల నిరసనలు, ఆర్థిక భారం పెరగడంతో వెనక్కి తగ్గింది. అంటే ఒకరకంగా ఓడిపోయి వెను తిరిగివచ్చింది. 2001 నుంచి 2021 వరకు 20 సంవత్సరాలు ఆఫ్ఘనిస్తాన్‌లో లక్షల కోట్ల రూపాయలు ఖర్చుచేసి, చివరకు తాలిబన్లకే అధికారం అప్పగించి అమెరికా వెనుతిరిగింది. ఇదొక అంతులేని యుద్ధం. అందుకే అమెరికా భరించలేకపోయింది. రోజుకు రూ.2500 కోట్లు ఖర్చుచేసేది. అది ఆ దేశ ఆర్థికవ్యవస్థకే భారమైంది. ఉత్తర కొరియా దూకుడును అడ్డుకోవడానికి 1950 నుంచి 1953 వరకు యుద్ధంచేసింది. వేల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. భీకర పోరాటంలో చివరకు ఎవరూ గెలవకుండానే 'కాల్పుల విరమణ' ఒప్పందంతో యుద్ధం ఆగిపోయింది. నేటికీ అక్కడ శాంతి ఒప్పందం జరగలేదు. సోమాలియాలో జరుగుతున్న అంతర్యుద్ధం, కరువును అరికట్టడానికి అమెరికా 1992 నుంచి 1994మధ్య శాంతి పరిరక్షక దళాలను పంపింది. అయితే, 1993లో అమెరికా సైన్యానికి, సోమాలియా తిరుగుబాటుదారుల మధ్య భీకర యుద్ధం జరిగింది. రాత్రంతా జరిగిన ఈ యుద్ధంతో తిరుగబాటుదారులతోపాటు సోమాలియా ప్రజలు కూడా అమెరికా సైన్యాన్ని, వారిని కాపాడటానికి వెళ్లిన దళాలను కూడా చుట్టుముట్టారు. దీంతో రాజకీయంగా ఒత్తిడిపెరిగి, లక్ష్యం పూర్తి కాకముందే 1994లో క్లింటన్ ప్రభుత్వం సైన్యాన్ని వెనక్కి పిలిపించింది. 1982,1984 మధ్య లెబనాన్‌లో శాంతిని నెలకొల్పడానికి పంపిన అమెరికా మెరైన్స్‌పై 1983లో భారీ ఆత్మాహుతి దాడిజరిగింది. ఇందులో 241 మంది అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈభారీ ప్రాణనష్టాన్ని భరించలేక, అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ కొద్ది నెలల్లోనే సైన్యాన్ని వెనక్కిరప్పించారు. ఇది అమెరికాకు పెద్ద సైనిక పరాజయం గా నిలిచింది. 1961లో క్యూబాలోని ఫిడెల్ కాస్ట్రో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అమెరికాచేసిన ప్రయత్నం విఫలమైంది. అమెరికా శిక్షణఇచ్చిన క్యూబా ప్రవాసుల సైన్యం మూడురోజుల్లోనే లొంగిపోయింది. అమెరికా మద్దతు ఉన్నప్పటికీ ఈఆపరేషన్ ఘోరంగా విఫలమవ్వడం వల్ల అంతర్జాతీయంగా అమెరికా పరువుపోయింది. ఒకప్పుడు మేము చెప్పిందే వేదం, మేము వచ్చిగొడవలు ఆపుతాం అన్న అమెరికా, ఇప్పుడు మీ యుద్ధాలు మీరే చూసుకోండి, మేము కేవలం ఆయుధాలు, సలహాలు మాత్రమే ఇస్తాం అనే ధోరణికి వచ్చేసింది. ఇది ఒక రకంగా అగ్రరాజ్యంగా తన మనుగడను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నం. ●



## పంచభూతాల్లో లీనమైన ఆశాభోస్లే

### శివాజీరావు పార్కులో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

**ముంబయి, ఏప్రిల్ 13:** భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. దిగ్గజ గాయని, స్వర సామ్రాజ్ఞి ఆశా భోస్లే (92) పంచభూతాల్లో లీనమయ్యారు. ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సూర్యాస్తమయ వేళ, అశ్రునయనాల మధ్య ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణలతో తుది సంస్కారాలు నిర్వహించారు. ఆమె కుమారుడు ఆనంద్‌భోస్లే అంత్యక్రియల క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ సభ్యులు లాస్ట్ పోస్ట్ వాయిస్తూ ఆమెకు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించారు. అంతకుముందు ఆమె నివాసం నుంచి శివాజీ పార్క్ వరకు భారీ ఊరేగింపుతో అంతిమయాత్ర సాగింది. ఆశా భోస్లే ఏప్రిల్ 12న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరినట్లు తొలుత వార్తలు వచ్చినా, ఛాతీ ఇన్ఫెక్షన్, తీవ్రమైన అలసట కారణంగా ఆమె మరణించినట్లు మనవరాలు జనై భోస్లే వెల్లడించారు. పదేళ్ల వయసులోనే మరాఠీ చిత్రంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించిన ఆశా భోస్లే, ఎనిమిది దశాబ్దాలకు పైగా తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఉమ్రావ్ జాన్ , తీస్రీ మంజిల్ , రంగీలా వంటి చిత్రాల్లో ఆమె పాడిన ఎన్నో గీతాలు అజరామరంగా నిలిచిపోయాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తౌబా తౌబా పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది. ఆమె మరణంతో భారతీయ సంగీతంలో ఓ సువర్ణాధ్యాయం ముగిసినట్లయింది.

## అంబేద్కర్ భావి తరాలకు స్ఫూర్తి: సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్13:** భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ఆయన కొనియాడారు.దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు ఆయన నిరంతరాయంగా కృషి చేశారని గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును తన ముందుచూపుతో ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావి తరాలకు స్ఫూర్తి నిలిచారని స్మరించారు. అణగారిన వర్గాల ప్రజల హక్కులకు అంబేద్కర్ గారు చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఆ మహనీయుని ఆశయాల సాకారానికి మనమంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.బాబాసాహెబ్ ఆలోచనల నుంచి ప్రేరణ పొందిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకుందని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేయటంతో పాటు రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో గతంలో ఎప్పుడూ లేని విధంగా మెస్‌ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు ప్రజా ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతుందని అన్నారు.

## ఆర్ఎస్ఎస్ సభలకు వెళ్లినవారు నాకేం న్యాయం చేస్తారు!

### జస్టిస్ స్వర్ణకాంత్‌శర్మను తప్పించాలంటూ కేజ్రీవాల్ వాదనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** ఢిల్లీ మద్యం కేసును కొట్టేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు నుంచి విముక్తి పొందిన కేజ్రీవాల్ దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణ జరిపేందుకు సిద్ధమైన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ గతంలో బీజేపీ, ఆరెస్సెస్ ఈవెంట్లకు హాజరయ్యారని, ఆయన ఈ కేసులో తనకు న్యాయం చేస్తారనే నమ్మకం లేదని, కాబట్టి ఈ కేసు విచారణ నుంచి తప్పుకోవాలని కేజ్రీవాల్ సంచలన డిమాండ్ చేశారు. జడ్జి స్వర్ణకాంత శర్మను ఉద్దేశించి కేజ్రీవాల్ మీరు అధివక్త పరిషత్ యొక్క కొన్ని కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ కేసు ఒక రాజకీయ కేసు. నిజానికి, సుప్రీంకోర్టు తన పరిశీలనలో క్రియాశీల ప్రజాస్వామ్యంలో అభిప్రాయానికే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొంది. సీబీఐని పంజరంలో బంధించిన చిలుక అని చెప్పింది. సీబీఐ ఆ అభిప్రాయాన్ని తొలగించుకోవడం ముఖ్యమని తెలిపారు. మద్యం విధానం కేసులో తనను, ఇతరులను నిర్దోషులుగా ప్రకటించిన ట్రయల్ కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ శర్మను తప్పించాలని కోరుతూ కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మీరు ఒక నిర్దిష్ట భావజాలానికి చెందిన కార్యక్రమానికి వెళ్లినప్పుడు, నేను దానికి వ్యతిరేక భావజాలానికి చెందినవాడినైతే నాకు న్యాయం జరుగుతుందా అనే అభిప్రాయం నా మనసులో ఏర్పడిందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అధివక్త పరిషత్ ప్రచారం చేస్తున్న భావజాలాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ బహిరంగంగా వ్యతిరేకిస్తుందని, ఈ విషయంలో న్యాయం జరుగుతుందా లేదా అనే ఆందోళన తనకు కలిగిస్తోందని, సీబీఐ, ఈడీ కోరిన దాన్నే ఈ కోర్టు ఆమోదిస్తుందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ వాదన నేపథ్యంలో జడ్జీ ఈ కేసు విచారణ చేయాలా వద్దా అనేది కోర్టు తేల్చనుంది.



## గ్యాస్ బ్లాక్‌మార్కెటింగ్‌పై పౌర సరఫరాల శాఖ కొరడా

### 5,079 సిలిండర్లు సీజ్.. 2,089 కేసులు నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఎల్‌పిజి గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్‌పై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఉక్కుపాదం మోపుతోంది. గృహ అవసరాలకు ఉద్దేశించిన ఎల్‌పిజి సిలిండర్లు (డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్)ను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న వారిపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తోంది. ఈ మేరకు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 5079 గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాలశాఖ సీజ్ చేసింది. ఇక 5 కిలోల చిన్న సిలిండర్లతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఘటనలనూ తీవ్రంగా పరిగణిస్తోంది. దాదాపు 70 చిన్న సిలిండర్ల వాణిజ్య వినియోగాన్ని అధికారులు అడ్డుకుని సీజ్ చేశారు. ఇప్పటి వరకు రూ.1.5కోట్ల విలువైన గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాలశాఖ సీజ్ చేసింది. 2089 కేసులు నమోదు చేసింది.

# బిజెపికి మహిళాధ్యక్షురాలు ఎందుకు లేరు?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 13:** బీజెపి ఏర్పడి 46 సంవత్సరాలైనప్పటికీ ఇప్పటి వరకు అధ్యక్షురాలిగా మహిళను నియమించ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించిందని, ఇప్పటి వరకు 15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగిందని, కానీ ఒక్కసారి కూడా మహిళకు అధ్యక్ష పదవి అప్పగించలేదని విమర్శించారు. దీనిని బట్టి బీజేపీకి మహిళల పట్ల ఉన్న గౌరవం, చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. ముందు బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించిన తర్వాత బండి సంజయ్ మహిళలకు న్యాయం చేయడం గురించి మాట్లాడాలని సూచించారు. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షి ణాది రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వ్యతిరేకమని విమర్శించారు.తమ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తెలంగాణను సాధించారని, ఇప్పుడు నియోజకర్గాల పునర్విభజనపై కూడా పోరాడతారని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షి ణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను ఏకం చేస్తామని అన్నారు. పార్లమెంటులో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సవాల్ చేశారు. 60 ఏళ్లలో మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని అన్నారు. కానీ బీజేపీ మహిళా అధ్యక్షురాలిని కాదు కదా, జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్ పదవి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మహిళలను చిన్నచూపు చూడటమే బీజేపీ లక్షణమని, వారు మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్‌దే అన్నారు. యాభై శాతానికి సీట్ల పునర్విభజన జరిగితే ఉత్తరాది సీట్లు పెరగడం వల్ల కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మోదీ ఇంటి ముందు బంట్రోతులుగా నిలబడుతూనే వాళ్ల అవసరం ముందు ఉండదని అన్నారు.'రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అప్పటికి ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు.. పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ.. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగ బద్దమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది అని చెప్పారు. మహిళల నాయకత్వంలో

## కాంగ్రెస్‌లో మహిళల నాయకత్వంలో పనిచేశాం, ప్రధాని, రాష్ట్రపతులను చేశాం

### కిషన్, బండి సంజయ్ విమర్శలకు సిఎం రేవంత్‌రెడ్డి కౌంటర్

పనిచేసిన పార్టీ కాంగ్రెస్, రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లను తీసుకువచ్చారు అని చెప్పారు. 'సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదు అని చెప్పారు. 'సీట్ల పునర్విభజనలో పర్యవసానాలు కాదు నెంబర్ ముఖ్యం..వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయింది..నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరితోనూ చర్చలు చేయరు అని పేర్కొన్నారు.. బాగా పనిచేస్తున్న రాష్ట్రాలను శిక్షించవద్దు.. 1980 ఏప్రిల్ 6 బీజేపీ ఏర్పాటైంది, ఇప్పటి వరకు 15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటి వరకు భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళ నియామకం జరగలేదు. బీజేపీకి మహిళ పట్ల గౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా..? అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలి.. బండి సంజయ్ వ్యాఖ్యలు దక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. దక్షిణాది సీట్లు తగ్గితే ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్ల సీట్లు కూడా తగ్గుతాయని. మా ఎంపీలు తెలంగాణను సాధించారు. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారు అని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం. పార్లమెంట్‌లో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం హెచ్చరించారు.

# కళ్లెదుటే తల్లిదండ్రులు, చెల్లెలు దుర్మరణం

### ముగ్గురి ప్రాణాలు చిదిమేసిన రోడ్డు ప్రమాదం

### ప్రాణాలతో బయటపడిన 13యేళ్ల బాలుడు

### వికారాబాద్ జిల్లాలో దుర్ఘటన

**పెద్దేముల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** కళ్లెదుటే కన్న తల్లిదండ్రులను, చెల్లెల్ని కోల్పోయాడా బాలుడు. అమ్మమ్మ గారింట్లో శుభకార్యానికి వచ్చి తిరుగు ప్రయాణంలో వారి ప్రాణాలను లారీ బలి తీసుకుంది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన బాలుడు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. హృదయ విదారక సంఘటన సోమవారం పెద్దేముల్ మండలం తట్టేపల్లి వద్ద చోటు చేసుకుంది. జహీరాబాద్ పట్టణానికి చెందిన కవిరాజ్ (40), పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35)తో 15 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. కవిరాజ్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వారికి 13 ఏళ్ల బాలుడు కార్తీక్ పాటు కీర్తన (11) సంతానం ఉన్నారు. రుక్మాపూర్ వద్ద పుట్టింట్లో ఓ శుభకార్యానికి రావాలని పావనికి పిలుపువచ్చింది. దాంతో కవిరాజ్, పావని, కార్తీక్, కీర్తన రుక్మాపూర్ గ్రామానికి వచ్చారు. ఆదివారం రాత్రంగా కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. సోమవారం ఉదయం తిరిగి స్కూటీ వాహనంపై నలుగురు కలిసి జహీరాబాద్‌కు బయలుదేరారు. మరో గంట ప్రయాణం చేస్తే జహీరాబాద్‌కు క్షేమంగా చేరుకునేవారు. అదే సమయంలో జహీరాబాద్ నుంచి తాండూరు వైపు నాపరాయి నిమిత్తం అతివేగంగా వస్తున్న లారీ (టిఎస్08యుహెచ్0018) తట్టేపల్లి పరిసరాలలో కవిరాజ్ కుటుంబీకులు ప్రయాణిస్తున్న స్కూటీని బలంగా డీకొట్టింది. ప్రమాదంలో రక్తపుమడుగులో చెల్లాచెదురుగా పడిపోయారు. బలమైన గాయాలు తగలడంతో కవిరాజ్, పావని, కీర్తన సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. స్వల్ప గాయాలకు గురైన బాలుడు కార్తీక్ ప్రాణాలతో బయటపడ్డారు. కళ్లెదుటే కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోవడాన్ని చూసిన కార్తీక్ పసి హృదయం తల్లిడిల్లింది. గుండెలు అవిసేలా రోధిస్తూ తల్లిదండ్రులను లేపాలని ప్రయత్నించడం స్థానికులను కంటతడి పెట్టించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. అయితే, ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ నేరుగా తన వాహనాన్ని తీసుకుని పెద్దేముల్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లిండ్రులను కోల్పోయిన కార్తీక్‌కు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం తగిన సహాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. బాలుడి భవిష్యత్ బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని, ప్రమాదం బీమా కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.



మృతి చెందిన కుటుంబ సభ్యులు(ఫైల్)

# కెసిఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

### తప్పుడు ఆరోపణలు చేసినందుకు

### 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 13:** అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ..బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు లీగల్ నోటీసు పంపించారు. మంత్రి తరఫున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసు పంపించారు. నోటీసులో అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ కేటాయించడం జరిగిందని, ఇందులో తన ప్రమేయం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం టెండర్ విలువ రూ. 44.42 కోట్లే ఉన్నప్పటికీ, అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని,ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా కొనుగోలు చేసినట్టు తెలిపారు. అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎక్స్పర్ట్ కమిటీ సూచనల మేరకే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు 48 గంటల్లో సోషల్ మీడియా పోస్టులను తొలగించి, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని లీగల్ నోటీసులో హెచ్చరించారు. అనంతరం ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క, అంగన్వాడి మొబైల్ కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తోందని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరైనా ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ అవాస్తవాలను పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేయడం వల్లే ఆ పార్టీ అధినేత కేసీఆర్ కు లీగల్ నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో కూడా ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు తాను కేసీఆర్‌కు లీగల్ నోటీసు పంపించినట్టు గుర్తుచేశారు. 'తప్పును పదిసార్లు చెబితే నిజం కాదు. రూ.44 కోట్ల టెండర్‌లో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం హాస్యాస్పదం'అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడిన పుడు తాను గట్టిగా సమాధానం ఇచ్చిన తరువాత తనపై దుష్ప్రచారం ప్రారంభమైందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## నాంపల్లి కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** మైనర్ల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు వేయించడంలో పోలీసులు మరోసారి విజయం సాధించారు. సంజీవరెడ్డి నగర్ పరిధిలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికపై లైంగిక దాడిచేసి ఆమె తల్లి కావడానికి కారకుడైన ఓ యువకుడికి నాంపల్లి 12వ అదనపు సెషన్స్ కోర్టు మరణించే వరకు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెలువరిం చింది. దీంతో పాటు సదరు నేరగాడు బాధిత బాలికకు పది లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని, పది వేల రూపాయల జరిమానా కూడా క ట్టాలని తీర్పు చెప్పింది. వివరాలు ఇలావున్నాయి. 2014 మే 11వ తేదీన ఎస్ఆర్ నగర్‌లోని బికె గూడాకు చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న మైనర్ బాలిక కడుపునొప్పితో అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా ఆ బాలిక గర్భవతిగా వున్నట్లు వైద్యులు తెలిపారు. కొన్ని గంటల తరువాత ఆ బాలిక మగ శిశువుకు జన్మనిచ్చింది. దీనిపై వైద్యులతో పాటు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు బాలికపై అఘాయిత్యా నికి పాల్పడ్డ నిందితుడు మడకారు శ్రీనివాసులు (24)పై ఫోక్సో కేసు నమోదు చేశారు. వాస్తవానికి ఈ కేసులో బాధిత బాలిక సెలవుల కోసం చుట్టాల ఇంటికి రాగా కర్నూలుకు చెందిన శ్రీనివాసులు ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి

## బాలికపై అఘాయిత్యం కేసులో నిందితుడికి మరణించే దాకా జీవిత ఖైదు

బికె గూడలో వుండసాగాడు. ఆ బాలికకు బంధువైన ఓ బా లుడితో ఆడుకునే నెపంతో తరచూ ఇంటికి వచ్చే శ్రీనివాసులు ఇదే సమయంలో బాలికపై లైంగికదాడికి పాల్పడి ఆమెను గర్భవతి చేశాడు. ఆ బాలి క శిశువుకు జన్మనిచ్చిన తరువాత వైద్యుల సూచనల మేరకు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగు చూసింది. అనం తరం నిందితుడు శ్రీనివాసులును అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో పోలీసులు వేగంగా విచారణ చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై ఏడాదిన్నరకు పైగా వాదనలు జరిగాయి. ఈలోపు నిందితుడు శ్రీనివాసులు బెయిల్‌పై విడుదలయ్యాడు. దీనిపై సోమవారం నాడు నాంపల్లి 12వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి టి. అనిత తీర్పు వెలువరిస్తూ మైనర్ బాలికపట్ల అమానుషంగా ప్రవర్తించిన నిందితుడ శ్రీనివా సులుకు మరణించే వరకు జీవిత ఖైదు శిక్ష విధించారు. దీంతో పాటు బాధిత బాలికకు పది లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించాలని జడ్జి తీరు ్ప చెప్పారు. ఇదే కేసులో నిందితుడికి పది వేల రూపాయల జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించకుంటే ఆరు నెలల సాధారణ జైలు శి క్షను అనుభవించాల్సి వుంటుందని జడ్జి తెలిపారు. తీర్పు వెలువడిన వెంటనే నిందితుడు శ్రీనివాసులును పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జై లుకు తరలించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా శ్రీనాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రామకృష్ణ, లీగల్ కౌన్సిలర్లుగా కల్పన, హేమ మీనన్ వ్యవహరించారు. ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడేలా చేసిన పోలీసు అధికారులను ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.



బాలికపై అఘాయిత్యం కేసులో మరణించే వరకు జీవితఖైదు శిక్ష పడ్డ నిందితుడు శ్రీనివాసరావు

## వారంరోజులపాటు వడగాడ్పులే

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వాతావరణ నిపుణులు

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ఇప్పటికే మాడు పగిలే ఎండలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ మరో పిడుగులాంటి వార్త చెప్పింది. రానున్న ఏడు రోజుల పాటు అసాధారణస్థాయిలో ఎండల తీవ్రతకుతోడు రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు వీస్తాయని హెచ్చరించింది. ప్రముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో సూర్యుడు ప్రతాపం చూపనున్నాడని, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ వంటి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రిల నుండి 45 డిగ్రిల వరకు నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉండటంతో మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడం ప్రమాదకరమని ప్రజలను వాతావరణ నిపుణులు స్పష్టం హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాల్లో కూడా ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.వారం రోజులు హీట్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుందని,ఈ నేపథ్యంలో డీహైడ్రేషన్, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు తగినంత నీరు, మజ్జిగ, ద్రవ పదార్థాలు తీసుకోవాలని, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ వంటి రక్షణ కవచాలను వాడాలని సూచిస్తున్నారు. రైతులు, బయట పనిచేసే కూలీలు ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయాల్లోనే పనులు ముగించుకోవాలని వాతావరణ నిపుణులు కోరుతున్నారు.

## పంటల మద్దతు ధర పథకం కింద మొక్కజొన్నను చేర్చాలి

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రధాన పంటగా సాగవుతున్న మొక్కజొన్నను మద్దతు ధరల పథకం (పిఎస్ఎస్) కింద చేర్చి దిగుబడిని కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ విషయమై సోమవారం ఆయన కేంద్రమంత్రికి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్, రబి సీజన్లలో మొక్కజొన్న ఒక ప్రధాన పంటగా సాగవుతోందని వెల్లడించారు. ప్రస్తుత రబి సీజన్‌లో సుమారు 11,21,494 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందని వివరించారు. అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఎకరాకు సగటు దిగుబడి 26.57 క్వింటాళ్లు ఉండగా, మొత్తం ఉత్పత్తి సుమారు 2,97,99,049 క్వింటాళ్లు (29.79 లక్షల మెట్రిక్ టన్నులు)గా అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. మార్చి మూడో వారంనుంచి మార్కెట్ యార్డులకు మొక్కజొన్న భారీగా రావడం ప్రారంభమైందని, ప్రస్తుతం క్వింటాల్‌కు సగటు ధర రూ.1,759 మాత్రమే ఉందని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,400తో పోలిస్తే రూ.641 తక్కువగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 92 కొనుగోలు సెంటర్లు ప్రారంభించి, రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు చేస్తున్నట్లు లేఖలో కేంద్రమంత్రి చౌహాన్‌కు తెలిపారు.



బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జెఎసి ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సు నిర్వహించిన దృశ్యం

## బిపి మండల్ సిఫారసులను అమలు చేయాలి

### ట్యాంక్‌బండ్‌పై మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### యాదవ జెఎసి చైర్మన్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను యాదవ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సు ను నిర్వహించారు. అనంతరం బీపీ మండల్( బిందేశ్వర ప్రసాద్ మండల్)44వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. దాసరి అజయ్‌కుమార్ యాదవ్ మాట్లాడు తూ... రాష్ట్రంలో బీపీ మండల్ ఉద్యమం గ్రామగ్రామాన చేపడతామన్నారు.ట్యాంక్ బండ్ మీద బీపీ మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్,బీహార్ రాష్ట్రాలలో బీపీ మండల్ ఉద్యమం ద్వారానే యాదవులు ముఖ్యమంత్రి అయ్యారన్నారు.తెలంగాణలో కూడా మరో మండల్ ఉద్యమం చేపడతామన్నారు.ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత బీపీ మండల్ కే దక్కుతుందన్నారు.బీపీ మండల్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలన్నారు.పార్లమెంట్ లో బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.70 కోట్ల ఓబీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ జయంతి,వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అధికారంగా నిర్వహించాలన్నారు.బీపీ మండల్ జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలన్నారు.రాష్ట్రంలో కూడా బీసీ కులాలు,బహుజన కులాలను కలుపుకొని యాదవులు ముఖ్యమంత్రి కావాలన్నారు.

## రోటర్‌డామ్ మారథాన్.. సావన్ జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** ఎన్ఎన్ మారథాన్‌లో, భారతదేశపు అత్యంత సుదీర్ఘకాలంగా ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టి సావన్ బర్వాల్ చరిత్ర సృష్టించాడు. రోటర్‌డామ్‌లో జరిగిన ఎలైట్ రేసులో బర్వాల్ 2 గంటల 11 నిమిషాల 58 సెకన్ల సమయం నమోదు చేసి 20వ స్థానంలో నిలిచాడు. తద్వారా, 1978లో శివనాథ్ సింగ్ నెలకొల్పిన 2:12:00 పాత జాతీయ రికార్డును అధిగమించాడు. ఆ రికార్డు 48 సంవత్సరాలుగా నిలిచి, భారత అథ్లెటిక్స్‌లో అత్యంత పురాతన జాతీయ రికార్డుగా నిలిచింది. 27 ఏళ్ల సావన్‌రికార్డును రెండు సెకన్ల మేర మెరుగుపరిచి, పురుషుల మారథాన్ ఈవెంట్‌లో కొత్త మైలురాయిని అధిగమించి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. పోటీతత్వం అధికంగా ఉన్న అంతర్జాతీయ వేదికపై బర్వాల్ స్థిరమైన వేగాన్ని కొనసాగించి ఒక సంచలన ఫలితాన్ని సాధించాడు. అతని ఈ కృషి, భారతదేశపు లాంగ్‌డిస్టెన్స్ రన్నింగ్ రంగంలో క్రమంగా జరుగుతున్న పురోగతిని ప్రతిబింబిస్తుంది. శివనాథ్ సింగ్ రికార్డు దశాబ్దాల పాటు చెక్కుచెదరకుండా ఉంది. దీనిని తరచుగా భారత అథ్లెటిక్స్‌లో అత్యంత కఠినమైన మైలురాళ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ విజయంతో బర్వాల్ మారథాన్‌లో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పి, ప్రపంచ వేదికపై భారతీయ లాంగ్ డిస్టెన్స్ రన్నర్లకు నూతన ఉత్తేజాన్ని అందించాడు.




**న్యూఢిల్లీ:** భారీ అంచనాలతో ఐపీఎల్ 2026 సీజన్‌ను ప్రారంభించిన ముంబై ఇండియన్స్ అందుకు తగ్గట్లుగానే శుభారంభం చేసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించి 13 ఏళ్ల తర్వాత ఈ టోర్నీని ఘనంగా ప్రారంభించింది. దాంతో ముంబై ఇండియన్స్‌కు తిరుగులేదని అంతా అనుకున్నారు. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు, నలుగురు వరల్డ్ టీమ్ కెప్టెన్లు ఉండటంతో ఈ టోర్నీలో ముంబై ఇండియన్సే విజేతగా నిలుస్తుందని 14 మంది స్టార్ స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేసారు. వారే కాదు ఏఐ టూల్స్ చాట్‌జీపీటీ, జెమీనై, గ్రోక్, మెటా ఏఐ అన్నీ టైటిల్ గెలిచే అవకాశాలు ముంబై కే ఉన్నాయని జోస్యం చెప్పాయి. కానీ ముంబై అనూహ్యంగా హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది.

## ముంబై ఇండియన్స్ హ్యాట్రిక్ పరాజయాలు

### ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే 7 మ్యాచ్‌లు గెలవాల్సిందే

ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు ఉన్నా పేలవ బౌలింగ్, చెత్త బ్యాటింగ్, లాకాఫ్ ప్లానింగ్ ముంబై ఇండియన్స్ పతనాన్ని శాసిస్తున్నాయి. వరల్డ్ బెస్ట్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ 4 మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ తీయకపోవడం గమనార్హం. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నా గాయపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. తిలక్ వర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటం కూడా ఆ జట్టుకు నష్టం చేస్తోంది. టోర్నీకి ముందు ముంబై ఈజీగా ప్లే ఆఫ్స్ చేరుతుందని చెప్పిన వారంతా, ఇప్పుడు ఆ జట్టు ఆటను చూసి నివ్వెరపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై పుంజుకొని ప్లే ఆఫ్స్ చేరుతుందా?

అంటే అవునని గట్టిగా చెప్పలేకపోతున్నారు. ఈ టోర్నీలో ముంబై 4 మ్యాచ్‌లే ఆడింది. ఇంకా 10 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఏం సంక్లిష్టంగా లేవు. చివరి 10 మ్యాచ్‌ల్లో 7 గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది. 8 గెలిస్తే ఏ జట్టుతో సంబంధం లేకుండా టోర్నీలో ముందడుగు వేస్తోంది. ఐపీఎల్‌లో లీగ్ దశ ముగిసే సరికి టాప్4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయన్న సంగతి తెలిసిందే.

టాప్4లో చోటు దక్కాలంటే ప్రతీ జట్టు కనీసం 8 విజయాలతో 16 పాయింట్స్ సాధించాలి. ముంబై ఇండియన్స్ ఇప్పటికే ఒక మ్యాచ్ గెలిచింది కాబట్టి మరో 7 గెలిస్తే సరిపోతుంది. ఓడిన మ్యాచ్‌ల్లో కూడా రన్‌రేట్ దెబ్బతినకుండా ప్రదర్శన చేయాలి. మరీ ముంబై తిరిగి పుంజుకుంటుందా? లేక తమ తడబాటు కొనసాగిస్తుందా? అనేది చూడాలి.




## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్.. అమన్, ముకుల్‌కు రజతం

### 17 పతకాలతో ముగించిన భారత్

**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో భారత్ తన ప్రచారాన్ని చివరి రోజున రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో ముగించింది. బిష్కెక్‌లో జరిగిన చివరి రోజు స్వర్ణం కోసం భారత్‌కు చెందిన ఇద్దరు రెజ్లర్లు పోటీపడినా, రెండు బౌట్‌లలోనూ విఫలమయ్యారు. 61 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో, అధిక స్కోరు నమోదైన పోరులో అమన్ సెహ్రావత్, ఉత్తర కొరియాకు చెందిన క్యాంగ్ మ్యాంగ్ కిమ్ చేతిలో 10-13 తేడాతో ఓడిపోయాడు. గతంలో 57 కేజీల విభాగంలో విజయం సాధించిన ఈ పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, అధిక బరువు విభాగంలో పోటీపడ్డాడు. అలాగే 86 కేజీల ఫైనల్‌లో ఇరాన్‌కు చెందిన కమ్రాన్ ఘాసెంపూర్ చేతిలో 0-7 తేడాతో ఓడిపోయిన ముకుల్ దహియా, భారత్ ఖాతాలో మరో రజత పతకాన్ని చేర్చాడు. ప్రచారాన్ని ముగించేందుకు దినేష్ కాంస్యం కైవసం చేసుకున్నాడు 125 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన అర్స్లాన్‌బెక్ తుర్దుబెకోవ్‌పై 12-1 తేడాతో ఆధిపత్య విజయం సాధించి కాంస్యం గెలుచుకోవడం ద్వారా భారత్‌కు చివరి పతకం లభించింది. ఫ్రీస్టైల్ మరియు మహిళల రెజ్లింగ్ జట్లు రెండూ బలమైన ప్రదర్శనను కనబరిచాయి. పురుషుల ఫ్రీస్టైల్ జట్టు రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతో గణనీయంగా రాణించగా, మహిళల జట్టు ఒక రజతం, నాలుగు కాంస్యాలను కైవసం చేసుకుంది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో.. ఆయుష్‌కు రజతం

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకున్న భారత్ షట్లర్ ఆయుష్ శెట్టి 61 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. చైనాలోని నింగ్బోలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్స్ 2026లో, పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో ప్రపంచ ఛాంపియన్ షి యుకి చేతిలో ఫైనల్‌లో ఓడిపోయిన తర్వాత ఆయుష్ శెట్టి రన్నరప్‌గా నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 25వ స్థానంలో ఉన్న 20 ఏళ్ల భారత ఆటగాడు, ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉన్న చైనా షట్లర్‌తో జరిగిన పోరులో 42 నిమిషాల్లో 21-8, 21-10 తేడాతో ఓడిపోయాడు. ఈ ఓటమి ఎదురైనప్పటికీ, ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్ విభాగంలో రజత పతకం గెలిచిన గత 61 ఏళ్లలో తొలి భారతీయుడిగా నిలిచిన ఆయుష్ ప్రస్థానం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 1965లో ఈ ఘనత సాధించిన దినేష్ ఖన్నా, ఈ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన ఏకైక భారతీయుడిగా నిలిచారు. 2018లో హెచ్.ఎస్. ప్రణయ్ కాంస్యం గెలిచిన తర్వాత, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్‌లో భారతదేశానికి శెట్టి పతకమే మొదటిది.











## ఫిడే కాండిడేట్స్.. జూనియర్ చేతిలో వైశాలి ఓటమి

### దివ్య విఫలం, ప్రజ్ఞానంద మ్యాచ్ డ్రా

**న్యూఢిల్లీ:** ఫిడే కాండిడేట్స్ 2026లో జూనియర్ చేతిలో భారత్ గ్రాండ్ మాస్టర్ వైశాలి ఓటమి చెందగా, దివ్య దేశ్‌ముఖ్, ప్రజ్ఞానంద రమేష్‌బాబుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేవలం రెండు రౌండ్లు మాత్రమే మిగిలి ఉండగా సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లోని 12వ రౌండ్‌లో భారత క్రీడాకారిణి వైశాలి రమేష్‌బాబు, చైనా క్రీడాకారిణి జూ జినెర్ చేతిలో కీలక ఓటమిని చవిచూసి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి పడిపోయింది. వైశాలి కంటే జూనియర్ బాగా ఆడి 7 పాయింట్లతో స్కోరును సమం చేసింది. టోర్నమెంట్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో, మహిళల విభాగంలో 12వ రౌండ్‌లో మూడు నిర్ణయాత్మక ఫలితాలు వెలువడటంతో పోరాటం మరింత తీవ్రమైంది. టోర్నమెంట్‌లో తన తొలి విజయాన్ని నమోదు చేసుకున్న మాజీ ప్రపంచ ఛాంపియన్ టాన్ జోంగి చేతిలో దివ్య దేశ్‌ముఖ్ ఓడిపోయింది. 5 పాయింట్లతో దివ్య చివరి ఇద్దరు క్రీడాకారిణులలో ఒకరిగా ఉంది. ఇతర మ్యాచ్‌లలో, బిబిసారా అసాబాయేవా కాటెరీనా లాగ్నోను ఓడించి 6.5 పాయింట్లతో పోటీలో నిలిచింది. అన్నా ముజిచుక్ అలెగ్జాండ్రా గోర్యాచ్కినాపై అద్భుతంగా ఆడినా కానీ ఆ ఊపును సద్వినియోగం చేసుకోలేకపోయింది. అలాగే ఓపెన్ సెక్షన్‌లో ప్రజ్ఞానంద రమేష్‌బాబు, ఆండ్రీ ఎసిపెంకో ఇద్దరూ డైనమిక్ ఓపెనింగ్‌తో బరిలోకి దిగడంతో అన్ని గేమ్‌లు డ్రాగా ముగిశాయి. దీంతో ప్రజ్ఞానంద 5 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలిచాడు. హికారు నకమురాతో డ్రా చేసుకున్న జవోఖిర్ సిందరోవ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, వెయ్ యిని ఓడించేందుకు చేరువైన అనీష్ గిరి 7 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. మరో మ్యాచ్‌లో మథియాస్ బ్లూబామ్, ఫాబియానో కరువానాతో డ్రా చేసుకున్నాడు.

# ఈక్విటీసూచీలకు పశ్చిమాసియా ఎఫెక్ట్!

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ఇంట్రా డే కనిష్ఠాల నుంచి సూచీలు అనూహ్యంగా కోలుకున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 702.68 పాయింట్లు నష్టపోయి 76,847.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207.95 పాయింట్లు తగ్గి 23,842.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు, రెండో అర్ధభాగంలో ట్రేడింగ్ పుంజుకోవడంతో నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాయి. పశ్చిమాసియాలో పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. రంగాల వారీగా చూస్తే, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల షేర్లు కూడా బలహీనంగా ఉన్నాయి. మెటల్ ఇండెక్స్ మిగతా రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ రాణించడం గమనార్హం. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడగా, మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. ప్రధాన సూచీల్లాగే మిడ్,స్మాల్‌క్యాప్‌లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.38 శాతం మేర నష్టపోయాయి. పశ్చిమాసియా చర్చలు విఫలం కావడంతో ముడిచమురుదరలు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైగా పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం ట్రేడింగ్‌లో 1790 షేర్లు పెరిగితే 2573 షేర్లు దిగజారాయి. 213 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 93.39గా కొనసాగితే ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ జూన్ ఐదు సెటిల్‌మెంట్లు 0.70 శాతంపెరిగి రూ.1,51,591కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురుధరలు 7.19 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 102. 39 డాలర్లుగా కొనసాగింది.



## డాలర్ వర్సెస్ రూపాయి 93.39

**ముంబయి,ఏప్రిల్ 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు 56పైసలు క్షీణించి 93.39గా కొన సాగాయి. వారం ప్రారంభంలోనే అమెరికా ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో నెల కొన్న ఉద్రిక్తతలు ముడిచమురుదరలు పెరుగుదలకు దోహదంచేసాయి. దీనితో డాలర్ చెల్లింపులు పెరగ దంతో రూపాయి క్షీణతకు దారితీసింది. దీనికితోడు హార్ముజ్ జలసంధి ప్రారంభించడంపై నెలకొన్న సంది గ్ధత, అమెరికా ఇరాన్ ఓడరేవులను ముట్టడిస్తామన్న హెచ్చరికలు, దేశీయ ఈక్విటీల్లో విదేశీ మూలధన నిధులు విత్‌డ్రా వంటివి రూపాయి క్షీణతకు ఎక్కువ కారణం అయ్యాయి. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్ వద్ద డాలరుతో రూపాయి మారకం 93. 30వద్ద ప్రారంభం అయింది. ఒకదశలో 93.40 వద్దకు కూడా చేరింది. కొద్ది సేపటితర్వాత 93.25కి చేరింది. చివరకు ట్రేడింగ్‌ముగిసేనాటికి 93.39గా నమోదయింది. దీనితో ముగింపుస్థాయిలో 56 పైసలు క్షీణించింది. గతవారాంతంలో రూపాయి 32 పైసలు క్షీణించి 92.83గా నడిచింది. ఫోరెక్స్ మార్కెట్ మంగళవారం బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార ణంగా సెలవు ఉంటుంది. మిరాయ్ అసె ట్ షేర్‌ఖాన్ విశ్లేషకుడు అనూజ్‌చౌదరి మాట్లా డుతూ గ్లోబల్ మార్కెట్లలో ఉన్న రిస్కులు, అమెరికా ఇరాన్ చర్చలువిఫలంవంటివి దోహదం అయ్యాయన్నారు.



## 3.40%గా రిటైల్‌ద్రవ్యోల్బణం

**ముంబయి, ఏప్రిల్ 13:** భారత రిటైల్‌ద్రవ్యోల్బణం మార్చినెలలో 3.40శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వార్షిక పద్దతిలో అఖిలభారత వినియోగదారుల ధరలసూచీ ద్రవ్యోల్బణ లెక్కింపునకు 2024 ప్రామాణిక సంవత్సరంగా తీసుకున్నారు. ఈ లెక్కన చూస్తే మార్చినెలలో 3.40శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకమ ంత్రిత్వశాఖ ప్రకటించింది. మోస్పి డేటా ప్రకారం గ్రామీణప్రాంతాల ద్రవ్యోల్బణం 3.63శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో దిగువస్థాయిలోనే అంటే 3.11శాతంగా ఉంది. ఆహారద్రవ్యోల్బణం మార్చినెలలో 3.87శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 3.96శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 3.71శాతంగా నెలకొంది. కొన్ని నిత్యావసర ఆహార ఉత్పత్తులు ధరల్లో భారీ తగ్గుదలను నమోదుచేసాయి. ఉల్లిధరలు 27శాతం తగ్గితే ఆలుగడ్డలు 19శాతం, వెల్లుల్లి, పప్పుదినుసులు కందిపప్పు, శనగలు వంటివికూడా తగ్గినట్లు మోస్పి డేటా చెపుతోంది. ఆహార ఉత్పత్తుల్లో టమోటాలు, కాలిఫ్లవర్ ఉత్పత్తులు కూడా ధరలు కొంతమేర పెరిగాయి. ఇక వెండి,ఇతర ఆభరణాల ద్రవ్యోల్బణం భారీస్థాయిలో ఉంది 148శాతంగాఉ న్నట్లు తేలింది.

# ఎయిరిండియా ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్!




వాణిజ్యం

ముంబయి, ఏప్రిల్ 13: ఎయిరిండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ పురోభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ, వారిలో ఉత్సాహం నింపేందుకు పెర్ఫార్మెన్స్‌లింక్డ్ స్టాక్ ఆప్షన్స్ (పీఎస్ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దీనివల్ల ఉద్యోగుల ఉత్పాదకతను పెంచి, సంస్థ వృద్ధికి బాటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త పథకానికి పీఎస్ఓపీ 2026 అని పేరు పెట్టారు. ఫిబ్రవరి 13న జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ ప్లాన్ కింద పైలట్లు, ఇంజనీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సహా అర్హులైన ఉద్యోగులకు కంపెనీ స్టాక్ ఆప్షన్లు కేటాయిస్తారు. ఉద్యోగులు ఈ షేర్లను రూ.4 ముఖ విలువ నుంచి, కేటాయింపు సమయంలోని మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో పనిచేసే అర్హులైన ఉద్యోగుల పనితీరుకు ప్రతిఫలం ఇవ్వడం, సంస్థ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడేలా వారిని ప్రేరేపించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతిభావంతులను ఆకర్షించడం, నిలుపుకోవడం కూడా దీని లక్ష్యమని సమావేశ తీర్మానంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 6న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన వివరాల ప్రకారం ఈ పథకం కింద కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్‌లో 0.25 శాతానికి సమానమైన సుమారు 22.71 కోట్ల స్టాక్ ఆప్షన్లను కొత్త షేర్లుగా జారీ చేయనున్నారు. షేర్ల కేటాయింపునకు 1 నుంచి 5 సంవత్సరాల వెస్టింగ్ పీరియడ్ ఉంటుంది. ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేలా టాటా ప్రోత్సహిస్తోంది. పనితీరు ఆధారంగానే షేర్ల కేటాయింపు ఉంటుంది. సంస్థ నిర్దేశించుకున్న అంతర్గత లక్ష్యాలలో 85 శాతం కంటే తక్కువ సాధిస్తే, ఉద్యోగులు కేవలం సగం షేర్లను మాత్రమే పొందే అవకాశం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఎవరికి, ఎన్ని షేర్లు, ఏ ధరకు కేటాయించాలనేది నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో, స్పైస్‌జెట్, అలాగే ప్రైవేటు సంస్థ ఆకాశ ఎయిర్‌లలో ఇలాంటి ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు అమల్లో ఉన్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ కొనుగోలు చేసినప్పుడు కూడా దాదాపు 8,000 మంది ఉద్యోగులకు షేర్లను కేటాయించారు. ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మార్చి 30న తన పదవికి రాజీనామా చేసినా, కొత్త వ్యక్తి బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగనున్నారు. నాయకత్వ మార్పు సమయంలోనే కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## ఐదేళ్లకాలానికి సవరించిన 'కేఫ్' ముసాయిదా విడుదల!

**ముంబయి, ఏప్రిల్ 13:** దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 2027 నుంచి 2032 మధ్య కాలానికి వర్తించే కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ కేఫ్ నిబంధనలను సడలిస్తూ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీతో సంప్రదింపులు జరిపి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ సవరించిన ముసాయిదాను సిద్ధం చేసింది. దశలవారీగా నిబంధనలను కఠినతరం చేసే విధానాన్ని ప్రభుత్వం ఎంచుకుంది. కేఫ్ 2027గా పిలిచే ఈ కొత్త నిబంధనలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2032 ఆర్థిక సంవత్సరం వరకు క్రమంగా వీటిని కఠినతరం చేస్తారు. దేశ వాతావరణ, ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా ఆటోమొబైల్ రంగాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలో ఇది మూడో దశ. గతంలో 2025 సెప్టెంబర్‌లో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే తాజా ఫ్రేమ్‌వర్క్‌లో కంపెనీలకు మంచి వెసులుబాటు కల్పించారు. కొత్త ముసాయిదాలో ఉద్గారాల లెక్కింపునకు సంబంధించిన ఫార్ములాను మార్చారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన దానికంటే వాహనాలు కొంచెం ఎక్కువ ఇంధనాన్ని వినియోగించుకోవడానికి వీలు కలుగుతుంది. బరువైన వాహనాలకు గతంలో ఉన్న ప్రయోజనాన్ని తగ్గిస్తూ, అన్ని రకాల వాహనాలకు దాదాపు ఒకే విధమైన నిబంధనలను తీసుకురావడం ఈ ముసాయి దాలోని మరో ముఖ్యమైన అంశం. ఈ కొత్త నిబంధనల్లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహం కల్పించింది. వీటికి సూపర్ క్రెడిట్స్ ఇచ్చారు. ఒక కంపెనీ ఫ్లీట్ ఉద్గారాలను లెక్కించేటప్పుడు ఒక ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ కారును ఒకటి కంటే ఎక్కువ వాహనంగా పరిగణిస్తారు. ప్లగ్‌ఇన్ హైబ్రిడ్, ఫ్లెక్స్‌ఫ్యూయల్ హైబ్రిడ్ వాహనాలకు ఇంకా అధిక మల్టిప్లయర్‌లు లభించనున్నాయి. ఇదే సమయంలో తయారీదారుల మధ్య క్రెడిట్ ట్రేడింగ్‌కు కూడా అనుమతి ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యాలను మించి ఉద్గారాలను తగ్గించిన కంపెనీలు, తమ అదనపు క్రెడిట్లను లక్ష్యాలను చేరుకోలేని ఇతర కంపెనీలకు విక్రయించుకోవచ్చు. నిబంధనలు పాటించని పెద్ద కంపెనీలపై వందల కోట్ల రూపాయల జరిమానాలు విధించే అవకాశం ఉందని ముసాయిదా స్పష్టం చేస్తోంది. మరోవైపు ఏటా 1,000 కంటే తక్కువ యూనిట్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## రూ.144.5 కోట్లు తక్షణమే చెల్లిస్తే కుప్పకూలుతాం!

### ఢిల్లీ హైకోర్టుకు స్పైస్ జెట్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు.


### ధర సవరింపు ప్రకటన

బీడీల యొక్క ఉత్పత్తి ఖర్చు గణనీయంగా పెరిగినందున, మేము మా బీడీల యొక్క ధరలను 15-04-2026 నుండి ఈ క్రింది విధంగా సవరింపు చేయవలసిన ఒత్తిడి తప్పటంలేదు.

| పరిమాణం | 920 బీడీలు | 460 బీడీలు |
|---|---|---|
| టోకువ్యాపార కొనుగోలు ధర | రూ.940/- * | రూ.470/- * |
| చిల్లర వర్తక కొనుగోలు ధర | రూ.964/- * | రూ.482/- * |
| 23 బీడీల కట్ట ధర (వినియోగదారుని కొనుగోలు ధర) | రూ. 27/- * | |

* 18% GST కలుపుకొని

మంగళూరు గణేశ్ బీడీ వర్క్స్
హెడ్ ఆఫీస్, వినోబా రోడ్, మైసూరు - 570 005
ఫోన్: 0821-2420241, 2427172
e-mail: customercare@mgbw501.com


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.